


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 15-03-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 181 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# మీకు సేవ చేయడం ఇష్టం

- మీ తరపున పోరాడడం ఇష్టం
- కేంద్రం అంటే మాకెందుకు భయం
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



గుంటూరు: గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగా ఏర్పాటు చేసిన జనసేన ఆవిర్భావ సభ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులను ఉద్దేశించి జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగించారు. నాకు మీ సేవ చేయడం ఇష్టం.

మీ తరపున పోరాడటం ఇష్టం. మీకు అండగా నిలబడటం ఇష్టం. భావితరాల కోసం ఏ సంపద విడిచిపెట్టాం. యుద్ధం, రక్తం, కన్నీరు తప్ప.. గాయాలు, బాధలు, వేదనలు తప్ప.. కథలు, కలలు, కల్లలు తప్ప.. పిరికితనం, మోసం తప్ప. జనసేన పార్టీ ఆవిర్భావానికి ముఖ్య కారణం సమకాలీన రాజకీయ వ్యవస్థ.

ప్రజల్ని వంచించి, మోసం చేసి మభ్యపెట్టి వాళ్లంతా పబ్బం గడుపుకొంటుంటే ప్రజల పక్షాన నిలబడి మీ ఇంట్లో వాడిగా, అన్నగా, తమ్ముడిగా మీకెంత బాధ ఉంటుందో, ఆవేశం ఉంటుందో అదే ఆవేశంతో పార్టీ పెట్టా. నాలుగేళ్లు అయింది. రాజకీయాల్లోకి వెళ్లే ముందు ప్రత్యేక హోదా గురించి, భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రి జైట్లీ మాట్లాడిన దానికి ఒక్కసారి ఆయనకు అర్థమయ్యే విధంగా ఆంగ్లంలో మాట్లాడుతా. కేంద్రం అంటే మనవాళ్లకు భయం.

పిరికితనం. దోపిడీచేసేవారికి పిరికితనం ఉంటుంది. మనకెందుకు భయం? టంగుటూరి ప్రకాశం పంతులు వారసులం మనం. మనకెందుకు భయం. సైమన్ కమిషన్ వస్తే చొక్కా విప్పి కాల్చిపారేయమన్నారు. తరువాయి 2లో

# స్టీఫెన్ హాకింగ్ కన్నుమూత



లండన్: ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్(76) కన్నుమూశారు. బుధవారం ఉదయం ఆయన కేంబ్రిడ్జ్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు స్టీఫెన్ కుటుంబ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఖమా నాన్న ఈ బధవారం మమ్మల్ని విడిచి వెళ్లిపోయారు. ఇది అత్యంత బాధాకరం అని స్టీఫెన్ పిల్లలు లూసీ, రాబర్ట్, టిమ్ ఓ ప్రకటనలో తెలిపారు.

స్టీఫెన్ పూర్తి పేరు స్టీఫెన్ విలియమ్ హాకింగ్. 1942 జనవరి 8న ఇంగ్లాండ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌షైర్ కౌంటీలో జన్మించారు. కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ నుంచి విద్యాభ్యాసాన్ని పూర్తి చేసిన స్టీఫెన్.. భౌతికశాస్త్రంలో అనేక పరిశోధనలు చేశారు. సాపేక్ష సిద్ధాంతం, గురుత్వాకర్షణ ఏకతత్వ సిద్ధాంతాలపై అధ్యయనాలు చేశారు. కృష్ణబిలాలు కూడా రేడియేషన్‌కు ఉత్పత్తి చేస్తాయని ధ్రువీకరించారు. దీన్నే హాకింగ్ రేడియేషన్ అని కూడా పిలుస్తారు. ఐన్‌స్టీన్ తర్వాత అంతటి శాస్త్రవేత్త..

భౌతికశాస్త్రంలో ఐన్‌స్టీన్ తర్వాత అంత గొప్ప శాస్త్రవేత్తగా హాకింగ్ పేరుగాంచారు. కృష్ణబిలాలు, బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతంపై ఆయన చేసిన అద్భుత పరిశోధనలు నేటి తరం శాస్త్రవేత్తలకు మార్గదర్శనం చేస్తాయి. గ్రహాంతర వాసుల ఉనికిపై చేపట్టే పరిశోధనలు మానవాళికి ముప్పుగా పరిణమిస్తాయని పలుసార్లు హెచ్చరించారు కూడా. ఖగోళ శాస్త్రంలో ఆయన చేపట్టిన పరిశోధనలు పెను విప్లవం సృష్టించాయి. ఆయన రచించిన ఖబ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ బ్రిటిష్ సండే టైమ్స్‌లో 237 వారాలపాటు బెస్ట్ సెల్లర్‌గా నిలిచి రికార్డు సృష్టించింది. ఆయన రచించిన ఓ పుస్తకం కాలం కథ పేరుతో తెలుగులో కూడా వెలువడింది.

### రెండేళ్లకే చనిపోతారని అనుకున్నారు..

అయితే ప్రమాదవశాత్తు ఆయన నరాల వ్యాధికి గురయ్యారు. 21ఏళ్ల వయసులోనే చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. 1963లో ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకునే రోజుల్లో ఆయన శరీరంలో అనేక మార్పులు వచ్చాయి. అదే సమయంలో ఆయన ఒక రోజు మెట్ల మీద నుంచి పడిపోయారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. స్టీఫెన్ పరిస్థితిని గమనించి కుటుంబసభ్యులు వెంటనే వైద్యులను సంప్రదించారు. ఆయన మోటార్ న్యూరాన్ వ్యాధికి గురైనట్లు వైద్యులు గుర్తించారు. దీని వల్ల శరీరం నెమ్మదిగా పక్షవాతానికి గురవుతుంది. ఆ సమయంలో ఆయన కేవలం రెండేళ్లే బతుకుతారని చెప్పారు.

అయినా కూడా స్టీఫెన్ కుంగిపోలేదు. విధిని తరువాయి 2లో



## కొనసాగిన
# ఉద్రిక్త వాతావరణం

- అసెంబ్లీలో కొట్టుకున్న ఎమ్మెల్యేలు
- వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యేలు
- వెల్‌లోకి దూసుకువెళ్లి నిరసన

గాంధీనగర్: గుజరాత్ అసెంబ్లీలో బుధవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ సాక్షిగా కాంగ్రెస్, భాజపా ఎమ్మెల్యేలు బాహాబాహికి దిగారు. ఒకరినొకరు కొట్టుకున్నారు. ఓ ఎమ్మెల్యే అయితే మైక్రోఫోన్‌ను విరగ్గొట్టి మరో సభ్యుడిపైకి విసిరాడు. ప్రశ్నోత్తరాల తరువాయి 2లో

# 1500కి.మీ దాటిన ప్రజా సంకల్పయాత్ర



పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప యాత్ర బుధవారం 1500 కిలోమీటర్ల మైలురాయిని దాటింది.

గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలోకి ప్రవేశించిన జగన్ 1500 కిలోమీటర్ల మేర పాదయాత్ర పూర్తిచేసినట్లు వైకాపా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి జగన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడ మొక్కలు నాటారు.

గుంటూరు పార్లమెంటు నియోజకర్గ వైకాపా అధ్యక్షుడు రావి వెంకటరమణ, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా నాయకులు పాదయాత్రలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పాలిట విలన్

## తెలంగాణ ప్రాంతం నాశనానికి కారణం ఆ పార్టీయే
## మా ఇష్టం వచ్చినట్లు అప్పులు చేసేందుకు ఆర్‌బీఐ ఒప్పుకోదు
## శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లలో ప్రభుత్వం లక్షల కోట్ల అప్పు చేసిందని విపక్షాలు చెప్పడంలో వాస్తవం లేదన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్ర అప్పు రూ.72వేల కోట్లు ఉంటే.. ఈరోజుకు పాతవి, కొత్తవి అన్ని కలిపి రూ.1.42కోట్లకు అప్పు చేరిందని ప్రకటించారు. ప్రభుత్వాలు ఇష్టం తరువాయి 2లో

## ఓటింగ్ పెట్టాలని అడిగినా
# పట్టించుకోలేదు: అవంతి



దిల్లీ: స్పీకర్ అంటే పార్లమెంట్ మొత్తానికి నాయకత్వం వహించాలని తెదేపా ఎంపీ అవంతి శ్రీనివాస్ అన్నారు. ఒక పార్టీకో, ప్రభుత్వానికో స్పీకర్ పరిమితం కాకూడదన్నారు. ఎంపీల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పై ఉందని తెలిపారు. ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లకు ప్రతిపాదించిన సవరణపై ఓటింగ్ పెట్టాలని తాము అడుగుతున్నా స్పీకర్ పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. తమ మాటలు వినకుండానే బిల్లును ఆమోదించారని తరువాయి 2లో

# అయోధ్య రామ మందిరం కేసు...



## సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం...

వివాదంపై రాజ్యాంగ ధర్మాసనం విచారించబోదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వివాదంలో జోక్యం చేసుకుని, వాదనలు వినిపించేందుకు అనుమతి కోరిన 32 పిటిషన్లను తిరస్కరించింది. కేవలం వివాదంతో ప్రత్యక్ష సంబంధంగల పిటిషనర్ల వాదనలను మాత్రమే విచారిస్తామని తెలిపింది. తిరస్కరణకు గురైన పిటిషన్లలో శ్యామ్ బెనెగల్, అపర్ణా సేన్, తీస్తా సెతల్వాద్, సుబ్రహ్మణ్యం స్వామి పిటిషన్లు కూడా ఉన్నాయి. అయితే అయోధ్య రామాలయంలో పూజలు చేసేందుకు తనకుగల ప్రాథమిక హక్కును అమలు చేయాలని కోరుతూ సుబ్రహ్మణ్యం స్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకరించింది. తరువాయి 2లో



# బీజేపీపై జనాగ్రహం కట్టలు తెంచుకుంది: రాహుల్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్పూర్ లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ-బీజేపీ విజయం, బీజేపీ ఓటమిపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. బీజేపీతో ప్రజలు విసిగిపోయారనే విషయం ఓటర్ల తీర్పుతో స్పష్టమైందని ఆయన అన్నారు.

ప్రభుత్వ పనితీరు బాగాలేదని ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, అదే ఈ తీర్పులో ప్రతిబింబించిందని రాహుల్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు.

గెలిచేందుకు అవకాశం ఉన్న బీజేపీయేతర అభ్యర్థులకే వారు పట్టంకట్టారని అన్నారు. కాంగ్రెస్ పరంగా చూసినప్పుడు యూపీలో పార్టీ పునర్నిర్మాణానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఇది రాత్రికి రాత్రే జరిగి పని కాదని అన్నారు.



# అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న నూకాంబికా అమ్మవారి అమావాస్య జాతర మహోత్సవాలు





***నూకాంబికా అమ్మవారి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త సత్తి రామకృష్ణారెడ్డికి ఆహ్వాన పత్రికనందజేస్తున్న 37వ వార్డు వైకాపా అధ్యక్షుడు బొడ్డేటి నాగేశ్వరరావు (నాగు), జైభారత్ నగర్ గ్రామ ఉపాధ్యక్షుడు కాండ్రేగుల శివ అప్పారావు, పొలమరశెట్టి గోపి తదితరులు.***

కంచరపాలెం : గ్రేటర్ విశాఖ 37వ వార్డు బర్మా క్యాంపులో వెలసిన శ్రీ నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ, మరియు జై భారత్ నగర్ గ్రామం తరఫున ఈ నెల 8వ తేదీ గురువారం నుండి ఘనంగా నిర్వహిస్తున్నట్లు జైభారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు బొగ్గు శ్రీను, 37వ వార్డు వైకాపా అధ్యక్షుడు బొడ్డేటి నాగేశ్వరరావు (నాగు) తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం కొత్త అమావాస్య జాతర మహోత్సవాలు జై భారత్ నగర్ సంక్షేమ సేవా సంఘం ఆద్వర్యంలో శ్రీ అమ్మవారికి పంచామృతా భిషేకం, నూతన వస్త్ర ధారణ గావిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా ఈ నెల 17వ తేదీ శనివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి సుమారు 10 వేల మంది భక్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం అమ్మవారి తిరువీధి మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

సాయంత్రం భక్తలచే అగ్నిగుండ ప్రవేశం జరుపబడుతుందని తెలియజేశారు.

కావున భక్తులు యావన్మధి పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని అమ్మవారి తీర్థప్రసాదములు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలియజేస్తు న్నామన్నారు.

# రైతులో 'పరకాయ ప్రవేశం చేసినప్పుడే' టెక్నోఫార్మింగ్ విజయం

## గీతం కార్నివాల్ వర్క్‌షాప్‌లో ఆదర్శరైతు డాక్టర్ రెడ్డి




సాగర్‌నగర్ : వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలంటే ముందుగా రైతులో పరకాయ ప్రవేశం చేయాలని వ్యవసాయం పట్ల వారికి గల అవగాహన, పంటల దిగుబడి, రాబడి, ఎరువుల వాడకం, నీటి లభ్యత, వ్యవసాయ రుణాలపై వారి ఆలోచనలను, ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని 'టెక్నోఫార్మింగ్' చేపట్టాలని హైదరాబాద్ ఐఐఐటిలో ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదలుకుని వ్యవసాయరంగంలో ప్రయోగాలు చేపడుతున్న డాక్టర్ శ్యామసుందర్ రెడ్డి పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం 'గుసాక్ కార్నివాల్-2018' లో బుధవారం 'టెక్నోఫార్మింగ్' వర్క్‌షాప్‌లో ఆయన ప్రసంగించారు. తనను తాను మొక్కల వైద్యుడిగా పిలిపించుకోవడానికి ఇష్టపడే డాక్టర్ రెడ్డి తెలంగాణా జిల్లాలలో పది సంవత్సరాల కిందటే మొబైల్ ఫోన్‌ల ద్వారా వ్యవసాయ క్షేత్రాల నుంచి సమాచారాన్ని సేకరించి ఏ విధంగా విశ్లేషించింది వివరించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో అయిదు ఎకరాలలో తాను నెలకొల్పిన 'సస్యశ్యామల కృషి వనం' ద్వారా చేసిన ప్రయోగాలను తెలియజేశారు.

భూసంరక్షణ, నీటి నిల్వలు, ఆర్గానిక్ ఫార్మింగ్ పై తాను నిర్వహించిన కోర్సులకు ఐటి రంగంలో పనిచేస్తున్న నిపుణులు ఆకర్షితులు కావడం ఆశ్చర్యపరిచిందన్నారు. ప్రస్తుతం రెండు వేల మంది ఐటి నిపుణులు 'ఐటి ఫార్మర్స్ గ్రూప్' గా ఏర్పడి ఖాళీ సమయంలో వ్యవసాయం చేయడం ద్వారా ప్రయోగాలు చేస్తున్నారని డాక్టర్ రెడ్డి వెల్లడించారు. తన దృష్టిలో అమెరికాకు వెళ్ళి చదవడం కంటే అనకాపల్లి వెళ్ళి మన రైతులకు సహాయపడే విధంగా విజ్ఞాన్ని పెంచుకోవడం అత్యుత్తమమైన మార్గమని భావిస్తున్నట్లు తెలిపారు.

**గీతం విద్యార్థులకు 'గూగుల్ క్రౌడ్ సోర్స్' అవకాశం**

ప్రఖ్యాత కంపెనీ గూగుల్ తాను చేపట్టిన 'గూగుల్ క్రౌడ్ సోర్స్' లో చేరాల్సిందిగా గీతం విద్యార్థులకు విజ్ఞప్తి చేసింది. గూగుల్ భారతీయ వ్యవహారాల విభాగం (క్రౌడ్ సోర్స్) నిపుణుడు మహ్మద్ నవాజుద్దీన్ బుధవారం తేది: 14-03-2018 న జరిగిన 'గూగుల్ వర్క్‌షాప్' లో విజ్ఞప్తి చేశారు. దేశంలోని 55 విశ్వవిద్యాలయాల విద్యార్థులకు 'గూగుల్ క్రౌడ్ సోర్స్' లో భాగస్వామ్యులుగా చేరాలని కోరామని అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి గీతం ఒకటని తెలిపారు.

'గూగుల్ క్రౌడ్ సోర్స్' సాంకేతిక అంశాలను ఆయన విద్యార్థులకు వివరించారు.

**విద్యాధికులు సినిమా రంగంలోకి రావడం పెరుగుతోంది: కోన వెంకట్**

తెలుగు చలన చిత్ర పరిశ్రమలోకి ఉన్నత విద్యను అభ్యసించిన వారు, సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్న వారు దర్శకులుగా, నటులుగా, రచయితలుగా ప్రవేశంచడం ఇటీవలి సంవత్సరాలలో పెరిగిందని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ పేర్కొన్నారు. గీతం గుసాక్ కార్నివాల్ లో విద్యార్థుల ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఉన్నత చదువులు చదివిన వారు సినీ రంగంలోకి ప్రవేశించడం వల్ల సాంకేతిక ప్రమాణాలు, నూతన ప్రయోగాలు సాధ్యపడతాయన్నారు. అయితే సినిమా రంగంలో గెలుపు, ఓటములను సమానంగా తీసుకురావాలని, వత్తిడులను అధిగమిస్తే విజయం వైపు ప్రయాణం



సాగుతుందన్నారు.

**కార్నివాల్‌లో సింగపూర్ విద్యార్థుల సందడి:**

గుసాక్ కార్నివాల్ లో భాగంగా బాలయోగి కళాప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రాక్‌బాండ్ పేరిట విద్యార్థులు పాశ్చాత్య గీతాలతో పాటు పలు సినీ గీతాలతో ఆహూతులను హుషారు పరిచారు. సింగపూర్ అన్న పాలిటెక్నిక్ కు చెందిన విద్యార్థి బృందం ఉత్సవ వేదికపై గీతం విద్యార్థులతో కలిసి నృత్యాలు చేసింది. రెండు రోజుల పాటు జరిగిన సాంకేతిక ఉత్సవం ముగింపు సందర్భంగా వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు, విద్యార్థి వ్యవహారాల విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం, సహాయ డైరక్టర్ డాక్టర్ ఎన్‌వీఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు బట్టలు నగదు పంపిణీ



గాజువాక: జీవీయంసీ 50వ వార్డు ఉప్పర కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులకు వైకాపా ఆద్వర్యంలో బుధవారం నగదు, బట్టలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి గాజువాక వైకాపా సమన్వయ కర్త తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ అగ్నిప్రమాద బాధితులకు అన్ని విధాలుగా ఆధుకుంటామని అన్నారు. బాధితు లకు ప్రభుత్వం నుంచి రావలసిన వన్నీ వచ్చేవరకు కృషి చేస్తామని అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి అగ్నిప్రమాధ బాధిత ఎలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిప్పల దేవన్‌రెడ్డి, ధర్మాలశ్రీను, మొల్లి చిన్న తిప్పలరాధ తదితరులు పాల్గొన్నారు.

## 17న జివియంసి షాపింగ్ కాంప్లెక్స్, మార్కెట్ ఆశీలకు బహిరంగ వేలం

- రెండవ జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య

**- శివాజీ పార్కు షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెంబర్లు 1, 2, 3, 4 మరియు 5**
**- నెహ్రూ బజార్ రోడ్డు ప్రక్క ఆశీలు (63 షాపులు మినహాయించి)**
**- శ్రీనగర్ రోడ్ ప్రక్క ఆశీలు, జగ్గారావు బ్రిడ్జి ప్రక్కన ఆశీలు**

విశాఖపట్నం : జివియంసి పరిధిలోని రెండవజోన్‌కు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లలోని షాపులు, మార్కెట్ ఆశీలకు మార్చి 17వ తేదీ ఉదయం 11 గంటలకు రెండవ జోనల్ కార్యాలయం ఆశీల్ మెట్ట వద్ద బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల మార్చి 13వ తేదీన నిర్వహించిన కొన్ని దుకాణాలు, మార్కెట్లు మరియు కళ్యాణ మండపాలకు ఆసక్తిగల పాటదార్లు పాడుకున్నారు. ఇంకా మిగిలిన శివాజీ పార్కు షాపింగ్ కాంప్లెక్స్‌లోని షాపు నెంబర్లు 1, 2, 3, 4 మరియు 5, నెహ్రూ బజార్ రోడ్డు ప్రక్క ఆశీలు (63 షాపులు మినహాయించి) శ్రీనగర్ రోడ్ ప్రక్క ఆశీలు, జగ్గారావు బ్రిడ్జి ప్రక్కన ఆశీలు, మరియు వాల్తేరు వీక్లీ మార్కెట్‌లకు ఆసక్తిగల పాటదారులు మార్చి 17వ తేది ఉదయం 11 గంటలకు రెండవజోన్ కార్యాలయం, ఆశీల్‌మెట్ట వద్ద బహిరంగ వేలం పాటలో పాల్గోనవలసినదిగా ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## స్టీఫెన్ హాకింగ్ కన్నుమూత

ఎదిరించి చక్రాల కుర్చీ నుంచే కదలలేని స్థితిలో ఉన్నా కూడా తన పరిశోధనలు, అధ్యయనాలను కొనసాగించారు. అయితే ఆయన తిరిగి మాట్లాడటానికి మాత్రం కుదరలేదు. దీంతో చేయితో సంజ్ఞలు చేసేవారు. తాను రూపొందించిన ఓ కమ్యూనికేషన్ డివైజ్ ద్వారా ఆయన సంజ్ఞలు అక్షర రూపంలోకి మారేవి. కొన్నాళ్లకు ఆ చేయి కూడా పక్షవాతానికి గురికావడంతో 2005 నుంచి తన చెంప కండరాలతోనే కమ్యూనికేషన్ డివైజ్‌ను కంట్రోల్ చేశారు. అలా దశాబ్దాల పాటు చక్రాల కుర్చీలోనే గడిపిన స్టీఫెన్ బుధవారం తుదిశ్వాస విడిచారు.

స్టీఫెన్‌కు ఇద్దరు భార్యలు. కేంబ్రిడ్జ్‌లో చదువుతున్న రోజుల్లో జానే విల్డే అనే అమ్మాయితో స్టీఫెన్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటికి స్టీఫెన్ వ్యాధి బయటపడలేదు. అయితే వ్యాధి గురించి తెలిశాక కూడా జానే పెళ్లి చేసుకునేందుకు ఒప్పుకొన్నారు. దీంతో 1965లో వీరిద్దరూ ఒక్కటయ్యారు. వీరికి ముగ్గురు పిల్లలు. అయితే కొన్ని కారణాల వల్ల 1995లో వీరి విడిపోయారు. ఆ తర్వాత అదే సంవత్సరం స్టీఫెన్.. ఎలైన్ మాసన్ అనే అమ్మాయిని పెళ్లిచేసుకున్నారు. 1980లో స్టీఫెన్ అనారోగ్యంలో ఉన్న సమయంలో మాసన్ ఆయనకు నర్స్‌గా పనిచేశారు. ఈ క్రమంలో వీరి మధ్య ప్రేమ చిగురించింది. అయితే 2006లో మాసన్‌తో కూడా విడిపోయారు.

మరణం గురించి హాకింగ్ ఏమన్నారంటే..

ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, అపర ఐన్‌స్టీన్ స్టీఫెన్ హాకింగ్(76) ఇకలేరు. కలిసిరాని విధిని సైతం తనకు అనుకూలంగా మార్చుకుని భౌతిక శాస్త్రంలో ఎన్నో ఆవిష్కరణలు చేసిన హాకింగ్ బుధవారం ఉదయం తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. శరీరం సహకరించకపోయినా, కదల్లేని స్థితిలో ఉన్నా ఎన్నో సిద్ధాంతాలు.. మరెన్నో అధ్యయనాలు చేశారు. ఆత్మస్థైర్యానికి నిదర్శనంగా నిలిచారు. జీవితంలో ఎన్నో మలుపులను చూసిన హాకింగ్ ఏనాడూ మరణం గురించి బాధపడలేదు, భయపడలేదు. చనిపోయేందుకు తాను దిగులు చెందట్లేదని.. అయితే అంతకు ముందు చేయాల్సిన పనులు ఎన్నో ఉన్నాయని అన్నారు. మృత్యువు గురించి ఒకానొక సమయంలో ఆయన ఏమన్నారంటే..

మరణం తర్వాత జీవితం లేదు. స్వర్గం అనేది ఒక కట్టుకథ. మరణం తర్వాత జీవితం, స్వర్గం, నరకం వంటివి ఏమీ లేవు. ఇవన్నీ మృత్యువు అంటే భయపడేవారి కోసం అల్లిన కట్టుకథలు. మనిషి మెదడు కూడా కంప్యూటర్ వంటిదే. విడిభాగాలు పాడైన తర్వాత కంప్యూటర్ పని చేయటం ఆగిపోయినట్టే మెదడు ఆగిపోతుంది. ఒక్కసారి మెదడు నిలిచిపోయిన తర్వాత ఏమీ ఉండదు. కన్నుమూసేలోపే మనకున్న శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ మంచి జీవితం గడపాలి. మనం చేసే పనులు అత్యున్నతంగా ఉండటానికి కృషి చేయాలి. 49 ఏళ్లుగా మరణం నాకు అత్యంత సమీపంలోనే ఉంటోంది. అయినప్పటికీ నేను మృత్యువు కు భయపడటం లేదు. త్వరగా మరణించాలని నేను భావించటం లేదు. నేను కన్నుమూసేలోపు చేయాల్సిన పనులు ఎన్నెన్నో ఉన్నాయి.

## కొనసాగిన ఉద్రిక్త వాతావరణం

సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బుధవారం అసెంబ్లీ సమావేశాలు మొదలైన తర్వాత ఉపముఖ్యమంత్రి నితిన్‌పటేల్ ఓ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై కాంగ్రెస్ ఎమ్మెల్యే విక్రమ్ మాట్లాడాలని ప్రయత్నించారు. అయితే ఇందుకు స్పీకర్ అంగీకరించలేదు. అనంతరం సభలో గందరగోళం తలెత్తడంతో ఎమ్మెల్యే విక్రమ్‌ను సభను సస్పెండ్‌చేశారు. దీంతో మరో కాంగ్రెస్ ఎమ్మెల్యే అమ్రీష్ దెర్ విక్రమ్‌కు మద్దతిస్తూ మాట్లాడారు. స్పీకర్ వద్దని హెచ్చరించినా అమ్రీష్ వినిపించుకోకుండా విమర్శలు చేశారు.

ఈ క్రమంలో భాజపా ఎమ్మెల్యే జగదీశ్ పంచల్.. అమ్రీష్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో అమ్రీష్ వెంటనే వెల్‌లోకి దూసుకెళ్లి నిరసన చేపట్టారు. అమ్రీష్‌కు మద్దతిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేశారు. ఇదిలా ఉండగా ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే మైక్‌ను విరగ్గొట్టి భాజపా ఎమ్మెల్యే జగదీశ్‌పై విసిరాడు. ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో స్పీకర్ సభను 15 నిమిషాల పాటు వాయిదా వేశారు.

వాయిదా అనంతరం సభ ప్రారంభం కాగానే భాజపా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరోసారి వాగ్వాదానికి దిగారు. ఇంతలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అమ్రీష్ వెంటనే సభలోకి వచ్చి ఓ భాజపా ఎమ్మెల్యేను కొట్టారు. దీంతో భాజపా ఎమ్మెల్యేలు అమ్రీష్‌ను చుట్టుముట్టి ఆయనపై పిడిగుద్దులు కురిపించారు. దీంతో సభను మరోసారి వాయిదా వేశారు.

## కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పాలిట విలన్

వచ్చినట్లు అప్పులు చేద్దామంటే కుదరదని.. ప్రతి పైసా పైనా ఆర్బీఐ నిఘా ఉంటుందన్నారు. భాజపా నేత కిషన్‌రెడ్డి కష్టపడే తత్వం గల నేత అని.. భవిష్యత్తులో ఆయన ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు కేసీఆర్ తెలిపారు. ప్రభుత్వ విధానాలు, పరిపాలనపై అవగాహన పెంచుకుని మాట్లాడితే ఆయనకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

ఆంధ్రా ప్రాంతాన్ని తెలంగాణతో కలిపింది, తెలంగాణ ఉద్యమంలో 400 మందిని కాల్చి చంపింది కాంగ్రెస్ పార్టీయే. తెలంగాణ ప్రాంతాన్ని భ్రష్టు పట్టించింది కూడా ఆ పార్టీయే. మేం తెలంగాణ కోసం పాటుపడుతున్న సమయంలోనే రాష్ట్రాన్ని విభజించొద్దని హైకమాండ్‌ను కోరింది కాంగ్రెస్ నేతలు కాదా? అలాంటివారు తెలంగాణను ఇచ్చింది మేమేనంటూ చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. 1956 నుంచి నేటి వరకు తెలంగాణ వినాశనానికి కారణం ఆ పార్టీయే. తెలంగాణ కోసం ఫ్రంట్‌లు పెట్టిన పలువురు కాంగ్రెస్ నేతలు పదవులు రాగానే వాటిని అటకెక్కించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు నంబర్‌వన్ శత్రువని 18ఏళ్ల క్రితం జలదృశ్యలో చెప్పాను. ఇప్పటికీ వారి ప్రవర్తన అలాగే ఉంది. తెలంగాణ కోసం రాజీనామాలు చేస్తామని చెప్పి మాట తప్పారు. తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వనని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శాసనసభలో అంటే ఒక్క ఎమ్మెల్యే కూడానోరు మెదపలేదు. ఇలాంటివారా తెలంగాణ గురించి మాట్లాడేది. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులైనా నిర్వహిస్తామని చెప్పినా కాంగ్రెస్ పార్టీలో ఇంత అసహనం ఎందుకు? అని కేసీఆర్ ప్రశ్నించారు.

## అయోధ్య రామ మందిరం కేసు...

అయోధ్య రామాలయం భూ వివాదంపై అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఉన్నారు. 13 పిటిషన్లపై ఈ ధర్మాసనం విచారణ జరుపుతోంది.

## ఓటింగ్ పెట్టాలని అడిగినా పట్టించుకోలేదు: అవంతి

అన్నారు. సభలో మెజారిటీ ఉండి కూడా అధికార పార్టీ ఓటింగ్‌కు ఎందుకు భయపడుతున్నారు? అని ప్రశ్నించారు. బుధవారం కూడా లోక్‌సభ కార్యకాలపాలను తెలుగు రాష్ట్రాల ఎంపీలు స్తంభింపజేశారు. నినాదాలతో హోరెత్తించారు. అయినా, నిరసనల మధ్యే స్పీకర్ సుమిత్రా మహాజన్ పలు బిల్లులకు సవరణలు చేసి ఆమోదింపజేశారు.

## మీ తరపున పోరాడడం ఇష్టం

మనకెందుకు భయం? అరుణ్ జైట్లీగారూ.. నాలుగేళ్లుగా ప్రజలకు మీరు చేసిన అన్యాయం మమ్మల్ని రగిలిస్తోంది. వేధిస్తోంది. సెంటిమెంట్‌తో ప్రత్యేక హోదా రాదన్నారు. మరి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రానికి మీరెలా మద్దతు పలికారు? విభజన సమయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భాజపా ప్రత్యేక హోదా ఇస్తాననలేదా? 1997లో కాకినాడలో ఒక సీటు రెండు రాష్ట్రాలు అని భాజపా చెప్పింది. ప్రజాస్వామ్యానికి దేవాలయం లాంటి పార్లమెంట్‌లో హామీ ఇచ్చి తప్పుతారా? మీర్చిన హామీలు నిలబెట్టుకోనప్పుడు.. మీ చట్టాలను మేమెందుకు పాటించాలి? కేంద్రం తన చేతలతో ఏపీని ఉద్యమ పథంలోకి నెట్టేసింది. రాజధాని లేకుండా తెలంగాణ నుంచి మమ్మల్ని నెట్టేశారు. మేం దిల్లీలో జంతర్ మంతర్‌లో పోరాటం చేయం.. ఏపీలోనే జాతీయ రహదారులపై చేస్తాం. కేంద్రం చర్యలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయి. అవినీతిపరులు, తప్పుచేసిన వారికి సీబీఐని వదులుతారని భయం ఉండొచ్చు. కేంద్రమంటే మాకేం భయంలేదు. మేమెవరికీ భయపడం. అమరావతిలోనే, అమరావతి నుంచే దేశాన్ని ఆకర్షించేలా పోరాడతా. జాతీయ రహదారులను దిగ్బంధించి మేం ఏంటో చూపిస్తాం.

అనుభవం చూసే మద్దతిచ్చా

ఏ పరిస్థితుల్లో నేను తెదేపాకు, భాజపా నాయకులకు మద్దతు పలికాను. ప్రచారం చేశాను? మీతో, మీ పిల్లలతో తొక్కించుకోవడానికా మీ వెనుక వచ్చింది? రాజకీయ వాతావరణం చూస్తుంటే కంచె చేనుమేసిన చందంగా ఉంది. సంఘం, సమాజం, ప్రజలంటే నాకు ప్రేమాభిమానాలు ఎక్కువ. మన రాష్ట్రాన్ని మనమే బాధ్యతగా చూడకపోతే ఆ దిల్లీ వాళ్లు ఎలా చూస్తారు? రాజు నీతి తప్పితే నేల సారం తప్పుతుందనే సామెత ఉంది. నేను చంద్రబాబుకు ఎందుకంత సపోర్టు చేశానంటే ఆయన అనుభవం చూసే. నాలుగేళ్లలో తెదేపా మాట్లాడిన మూడు మాటల్లో ఆరు అబద్ధాలు వినిపిస్తున్నాయి. తెలుగు దేశం ప్రభుత్వం అలా తయారైనందుకు బాధగా ఉంది. ఏపీ అభివృద్ధికి సామాజిక వర్గాల మధ్య ఐక్యత కోరుకున్నా. ఒకవేళ తెదేపా ఓడిపోయి యూపీఏ వచ్చి ఉంటే నన్ను ఏం చేసేవారో తెలుసా?ఏపీ పునర్నిర్మాణం కోసం తెదేపాకు మద్దతిచ్చా.. ఆ పార్టీ పునర్నిర్మాణానికి కాదు.

రాజకీయాలు చేయాలంటే దెబ్బలు తినడానికి సిద్ధంగా ఉండాలి. సీఎంను కలిసినప్పుడు రాజధాని నిర్మాణానికి 1500 -2000 ఎకరాలు చాలన్నారు. ఇప్పుడు 33 వేల ఎకరాలు అంటున్నారు. అందరికీ అభివృద్ధి కోసం తెదేపా ఏమీ చేయట్లేదనిపిస్తోంది. అభివృద్ధి కేవలం రాజధాని చుట్టూ కేంద్రీకృతం అయితే ఎలా? రాత్రికి రాత్రే చీకటి ఒప్పందాలు చేసుకొని ప్యాకేజీకి ఒప్పుకున్నారు. ఏపీకి ఇచ్చిన ప్యాకేజీ బాగుందన్నారు. మళ్లీ చట్టబద్ధత కల్పించలేదన్నారు. జగన్ సీఎం అయితేనే అసెంబ్లీకి వెళ్తారా? నేను సీఎం కాకపోయినా సమస్యలపై పోరాడటం లేదా? అని పవన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# రైల్వే జోన్ కోసం మాట్లాడిన తీరు సమంజసంగా లేదు

## ఈ ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి

## వాల్తేరు డివిజన్ నుండి అధిక ఆదాయం వస్తోంది

## గుడివాడ అమర్నాథ్



విశాఖపట్నంః ఈ ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయి. దశాబ్దాలుగా జోన్ కోసం ఎదురుచూస్తున్న తరుణం లో కేంద్రం ఈ విధంగా మాట్లాడడం దురదృష్టం. ఆనాడు విభజన నాటినుండి విశాఖకు అన్యాయం జరిగింది. రైల్వే జోన్ కాదు విశాఖకు మెట్రో లైన్ ఇస్తామనడం చూస్తుంటే ఈత కాయ ఇచ్చి తాటికాయ పట్టుకు పోతమన్నట్టు ఉందని ఆయన అన్నారు. దేశంలో ఉన్న అన్ని రైల్వే జోన్స్ కన్న వాల్తేరు డివిజన్ నుండి అధిక ఆదాయం వస్తున్న విషయం గమనించాలన్నారు. జోన్ ఏర్పాటుకు ఫెసభిలితి అంటున్నారు. దేశంలో ఇప్పటివరకు ఇచ్చిన ఏ రైల్వే జోన్‌కు ఉందని అన్నారు. తెలుగు దేశం రైల్వే జోన్ విషయంలో నాటకాలు అడుతున్నాయన్నారు. ఒక పక్క ఆ పార్టీ సీఎం జోన్ ఏర్పాటు చెయ్యాలని అంటారు. మరో పక్క ఆ పార్టీ ఎంపీ లు వేరు వేరు ప్రాంతాల పేరులు చెబుతున్నా విషయం తెలిసిందే అన్నారు. టిడిపి పార్టీ పరిస్తితి ఇలా ఉంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మరీ దారుణంగా ఉంది అన్నారు. ఇటీవలే జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ మానిఫెస్టోలో జోన్ ఏర్పాటు చేస్తామని చెప్పిన ఆ విషయం సంగతి గుర్తుచేశారు. గతశీలో జోన్ ఏర్పాటు కోసం తాను దీక్ష చేపట్టినప్పుడు ఏడ్డేవ చేసిన సంగతి తెలిసిందే అన్నారు. మొదట నుండి వైఎస్సార్సీపీ జోన్ కోసం పోరాడుతోంది అన్న విషయం తెలిసిందే అన్నారు. ఏ త్యాగాలకైనా తాము సిద్ధపడి జోన్ సాధించేందుకు పోరాటాలు చేస్తామని అన్నారు. ఏటువంటి షరతులు లేకుండా విశాఖ జోన్ సాధించడమే తమ లక్ష్యమన్నారు. టిడిపి, బీజేపీలకు విశాఖ పై ఏటువంటి ప్రేమ లేదు అన్నారు.

సమావేశంలో కొయ్య ప్రసాద్ రెడ్డి, సత్తి రామకృష్ణ రెడ్డి, తిప్పల నాగిరెడ్డి, ఉషాకిరణ్, కోలా గురువులు, అక్కరమాని నిర్మల, రవిరేడ్డి, ఫరూఖి, కాంతా రావు, తదితరులంతా పాల్గొన్నారు.

# నూకమాంబ అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు



కంచరపాలెం : మర్రిపాలెం శ్రీ రామ నగర్ ఆర్ .అండ్ .బి కూడలి వద్ద వెలసిన శ్రీ నూకమాంబ అమ్మవారి 27 వ కొత్త అమావాస్య కోత్సవ వేడుకలు ఈనెల 17 వ తేదీన ఘనంగా నిర్వహించ నునట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడబంధల రమణ తెలిపారు.

కార్యక్రమంలో బాగంగా 15 వ తేది ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం అమ్మవారి ప్రతిమ ఊరేగింపు నిర్వహిస్తామని 16 వ తేది ఉదయం కుంకుమ పూజ దీపారాధన సాయంత్రం ఆలయ ప్రాంగణంలో అగ్ని గుండం వేస్తామన్నారు. 17 తేదీ అమ వాస్య ఉదయం 4 గంటలకు అమ్మవారికి మేలు కొలుపు ప్రథమ పూజ,దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అనంతరం విశిష్ఠ అలంకరణలో అమ్మవారు భక్తులకి దర్శన మిస్తారని తెలియజేశారు.

కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

# 10వతరగతి విద్యార్థులు పరీక్షలు సక్రమంగా రాయాలని సర్వమత ప్రార్ధనలు

భీమునిపట్నం : రేపటి నుండి జరగబోయే 10వతరగతి పరీక్షలు సక్రమంగా జరగాలని బుధవారం భీమిలి జోనల్ కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జివిఎంసి కమీషనర్ హరినారాయణ్ మాట్లాడుతూ రేపటి నుండి 10వతరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఉండాలనిఇ అన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలు ద్వారా విద్యార్థులకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దివీస్ సౌజన్యంతో సుమారు రూ.6 లక్షల తో తడిపొడి చెత్త కు మున్సిపల్ వాహనం ను ఇచ్చారు. తరువాత డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు లింకేజ్ కింద రూ.60లక్షలు అందించారు. లయన్స్ క్లబ్ వారు వితరణతో రూ.15వేలు విలువ చేసిన ప్లాస్టిక్ డస్ట్ బిన్లను అందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో భీమిలి జడ్పీ సన్యాసి నాయుడు, భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా నూకరాజు, లయన్స్ క్లబ్ అద్యక్షురాలు బమ్మిడి. ఉమా,సెక్రెటరీ కొత్త.రామకృష్ణ ,సభ్యులు వి.రామకోటి,మైలపల్లి షణ్ముఖరావు, పద్మావతి నాయుడు, సన్ స్కూల్ అధినేత కైతపల్లి. శ్రీనివాసరావు, లావణ్య సి.హెచ్ గౌరి నాయుడు, జి.సన్యాసిరావు,దీవిస్ అధికారి నాగరాజు డ్వాక్రా మహిళలు, విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మశీ నిపుణులు సమాజ సేవకులు

## వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు



ఆంధ్ర యూనివర్సిటీః ఫార్మశీరంగ నిపుణులు సమాజ సేవకులుగా నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు అన్నారు. బుధవారం ఏయూ ఫార్మశీ కళాశాల వార్షికోత్స వాన్ని వుడా బాలల ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వైద్య, ఫార్మశీ రంగాలు సమాజంతో విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నాయన్నారు. సమాజానికి కరుణతో పనిచేయాలన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉపాధిని కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటూ యువతరం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. పల్సస్ గ్రూప్ సిఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపధ్యంలో అవకాశాలు విస్తృతం అవుతున్నాయన్నారు. ఉన్నత ఆలోచనలతో యువతరం సాగాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తును బయో మార్కర్స్ శాసిస్తాయన్నారు. విద్యార్థులు నిరంతరం తమ జ్ఞానాన్ని వృద్ధి చేసుకునే దిశగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రమెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి సుధాకర్ మాట్లాడుతూ నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు సేవచేయాలన్నారు. విలువలను పాటించడం, ఫార్మకో విజిలెన్స్‌ను కలిగి ఉండటం అవసరమన్నారు. ఇ-ప్రిస్కిప్షన్ దిశగా వైద్యులు నడవడం మంచి పరిణామమన్నారు. ఫార్మశిస్టులు మాత్రమే ఔషధాలను ఇవ్వాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా కల్పించే దిశగా పనిచేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.గౌరీశంకర్, రాక్స్ ఫార్మా గ్లోబర్ రెగ్యులేటరీ అఫైర్స్ హెడ్ డాక్టర్ సునీల్ కుమార్ శర్మ తదితరులు ప్రసంగించారు. కళాశాల ఆచార్యురాలు జె.విజయరత్న తన కుటుంబ సభ్యుల పేరుమీదుగా ఇద్దరు విద్యార్థులకు నగదు పురస్కారాలను ప్రధానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్టీఫెన్ హాకింగ్ మృతికి ఎన్‌పిఆర్‌డి సంతాపం

విశాఖపట్నం : ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ మృతికి వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోడూరు అప్పల నాయుడు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోతార్ న్యూరాన్ వ్యాధి శరీరాన్ని కబలిస్తున్నా, పనికి శరీరం సహకరించకపోయినా ఆయన కృష్ణబిలాలపై చేసిన పరిశోధనలు విజ్ఞాన శాస్త్రంలో సరికొత్త చరిత్రను సృష్టించాయన్నారు. వైకల్యాన్ని జయించిన ఆయన తనకు ఎదురైన ప్రతి అవరోధాన్నీ అకుంఠిత దీక్షతో ఎదుర్కొని గొప్ప శాస్త్రవేత్తగా నిలిచారని కొనియాడారు. స్వర్గం, నరకం కట్టుకథలంటూ మూఢ నమ్మకాలను పటాపంచలు చేశారని గుర్తు చేశారు. ఆయన ఆశయ స్ఫూర్తితో వికలాంగులు ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు.

# 18 నుండి శ్రీరామనవమి ఉత్సవాలు

విశాఖపట్నంః శ్రీ సీతారామాలయంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి వారి మంగళా శాసనములతో శ్రీ హరేరామ సంకీర్తన భక్తబృందం వారి ఆధ్వర్యంలో రాంరాం మందిరం వ్యవస్థాపక ధర్మకర్త సుధారామయ్యమ్మ సారథ్యంలో ఈ నెల 18వ తేది ఉగాది నుండి 28వ తేది వరకు శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించుచున్నామని సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.వి.రాజశేఖర్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ప్రతిరోజూ భక్తి సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు. సోమవారం శ్రీ సీతారాముల కల్యాణం నిర్వహించబడును.28వ తేది ఏకాదశి రోజున సాయంత్రం 7 గంటలకు శ్రీహరి సంకీర్తనా సేవా సంస్థ అన్నమయ్య గీతాంజలి వారిచే ఉయ్యాల సంకీర్తన నిర్వహించబడి శ్రీరామనవమి ఉత్సవాలు ముగుస్తాయి..శ్రీ సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు 9951173969 నందు సంప్రదించగలరు.

# ప్రాంతీయ భాషల్లోనికి శాస్త్రీయ, ఆరోగ్య సంరక్షణ సమాచారం

- వెయ్యి కోట్ల పెట్టుబడులు-పదివేల మందికి నేరుగా ఉపాధి కల్పన
- పల్సస్ సిఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు



ఆంధ్రా యూనివర్శిటీ : శాస్త్రీయ విజ్ఞానం, ఆరోగ్య పరిరక్షణ (హెల్త్‌కేర్) సమాచారాన్ని ప్రాంతీయ భాషలలోనికి అందించే దిశగా పల్సస్ గ్రూప్ పనిచేస్తోందని సంస్థ సిఇఓ, ఏయూ ఫార్మశీ కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. బుధవారం ఉదయం ఏయూ ఫార్మశీ కళాశాల వార్షికోత్సవంలో పాల్గొనడానికి విచ్చేసిన ఆయన తమ సంస్థ కార్యక్రమాలు, నూతన ప్రాజెక్టులను వివరించారు. ఇప్పటికే ఆంగ్లంలో ఉన్న వైద్య సంబంధ శాస్త్రీయ జ్ఞానాన్ని చైనీస్, రష్యన్ తదితర భాషలలో అనువదించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా ఆరోగ్యసంరక్షణ సమాచారాన్ని ప్రాంతీయ భాషలలో అందించాలనే దిశగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే మెడికల్, హెల్త్‌కేర్‌కు సంబంధించిన 2.5 కోట్ల శాస్త్రీయ అంశాలు(ఆర్టికల్స్) తమవద్ద ఉన్నాయన్నారు.

పల్సస్ గ్రూప్‌ను సైన్స్ పబ్లిషింగ్, ఫార్మకో విజిలెన్స్‌లో అగ్రగామిగా నిలపడం తమ లక్ష్యమన్నారు. భారత్‌తో పాటు ప్రపంచ దేశాలలో శాస్త్రీయ సమాచారం, డ్రగ్ సేఫ్టీ విధానాల అధ్యయనాన్ని జరపే ప్రముఖ వ్యవస్థగా తీర్చిదిద్దడం జరుగుతోందన్నారు. భవిష్యత్తులో సైంటిఫిక్, హెల్త్‌కేర్ రంగంలో సమాచారాన్ని వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. తాజా సర్వేల ప్రకారం 2020 నాటికి 75 శాతం మంది భారతీయులు తమ జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవడానికి మొబైల్ ఫోన్‌తో స్థానిక భాషల్లోనే సమాచారాన్ని సంగ్రహించుకునే ప్రయత్నం చేస్తారని తేలిందన్నారు.

శాస్త్రీయ అభివృద్ధి ఫలాలను అందరికీ అందించడం, నూతన ఆవిష్కరణ ఫలితాలను తెలియజేయడం జరుగుతుందన్నారు.

కెనడాకు చెందిన పల్సస్ గ్రూప్ లండన్, ఒన్‌టారియో, సింగపూర్, హైదరాబాద్, చెన్నై, గుర్‌గావ్‌లో తమ శాఖలను విస్తరించింది. తాజాగా విశాఖలో ఈ సంవత్సరంలో 2000 మందితో నూతన శాఖను ఆరంభించే ఆలోచన ఉంది. ఈ దిశగా పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాము.

# వికలాంగులు, వితంతువులకు అభయాంజనేయ ట్రస్ట్ ద్వారా నిత్యావసరాల పంపిణీ



మాధవధార : మాధవధార శ్రీ అభయ అంజనేయ ట్రస్ట్ ద్వారా వికలాంగులకు, వితంవులకు నిత్యవసర సరుకులు బుధవారం 40వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో శ్రీ అభయ అంజనేయస్వామి ట్రస్ట్ వ్యవస్థాపకులు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉత్తర నియోజక వర్గం సమన్వయ కర్త సనపల చంద్రమౌళి పంపిణి చేశారు.

ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శ్రీ అభయ అంజనేయస్వామి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తునామని తెలిపారు. పేదలకు సేవా చేయ్యడం లోనే నిజమైన సంతృప్తి ఉందని అన్నారు. అదేవిదంగా వికలాంగులు, వితంతులవుల పిల్లలకు చదువు ఖర్చులు తనే భరిస్తానాని హమి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 40వ వార్డు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, శ్రీరామ్‌నగర్ కాలనీ అధ్యక్షులు ఎస్‌కె.నబి, గుంపుల శరత్‌బాబు, కె.సత్యనారాయణ, మాధవరావు, రూపా తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకు వెళ్ళాలి



విశాఖపట్నం : టీడీపి ప్రభుత్వం పేద ప్రజలకు చేయూతనిచ్చే విదంగా ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకు వెళ్ళలిసిన బాధ్యత మనందరిపైనా వుందని 41 వ వార్డు అద్యక్షుడు పెంటకోట త్రినాధరావు కార్యకర్తలకు సూచించారు. ఈమేరకు బుధవారం ఉదయం సర్వసభ్య సమవేశం నిర్వహించిన ఆయన టీడీపి వార్డు నాయకులతో సమీక్షించారు .ఎప్పటికప్పుడు వార్డు ప్రజల సమస్యలను తెలుసుకుని సమస్య పరిస్కారం దిశగా కృషి చేయాలని అన్నారు.

కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెంటకోట విరలక్ష్మి, కార్తిక్ కుట్ట, నగల అప్పలరాజు, బి.శ్రీను, ఎస్ .పి.వి.రమణ, జి. శ్రీను, పైడిరాజు, పి.అప్పలరాజు, సుధ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి వినూత్న ప్రణాళికలు

- ఈనెల 16 నుంచి ఎయులో రెండురోజుల సదస్సు
- కన్వీనర్ ఆచార్య కె.విశ్వేశ్వరరావు



ఆంధ్రా యూనివర్శిటీః దివ్యాంగుల సంక్షేమానికి వినూత్న ప్రణాళికలు అమలు చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొంది స్తున్నామని, దీనిలో భాగంగా ఈనెల 16,17 తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలోని సోషల్‌వర్కు విభాగంలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు సంచాలకులు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. యుజిసి డిఎస్‌ఏ పథకం అమలులో భాగంగా సోషల్‌వర్కు విభాగం, ఆర్‌సిఐ సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఎయులోని ప్లాటినం జూబ్లీ అతిథి గృహంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు, గౌరవ అతిథులుగా రెక్టార్ ఆచార్య కె.గాయత్రీదేవి, విభాగాధిపతి ఆచార్య టి.శోభశ్రీలు పాల్గొంటారన్నారు.

సదస్సుకు అధ్యక్షులుగా ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ్మోహన్‌రావు వ్యవహరిస్తారన్నారు. దేశంలోని 10 రాష్ట్రాలనుంచి 140 మంది ప్రతినిధులు పరిశోధన పత్రాలు సమర్పించగా, సుమారు 100 మందికి అనుమతి మంజూరు చేశామని ఆచార్య విశ్వేశ్వరరావు తెలిపారు. ముంబాయి లోని టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్ లో ఎమిరిటస్ ఆచార్యులుగా ఉన్న లీనా కాశ్యప్ కీలకోపన్యాసం చేస్తారన్నారు.

మొత్తం ఆరు సెషన్‌లుగా సదస్సును రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగుల సమస్యలు, రక్షణాత్మక చర్యలు , ప్రభుత్వ విధానాలు తదితరాలపై రెండు రోజుల పాటు విస్తృత చర్చలు ఉంటాయన్నారు. రెండో రోజు సదస్సుకు రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు.

# ప్రేమసమాజంలో పంచాంగ శ్రవణం

విశాఖపట్నంః ప్రేమ సమాజం అడహాక్ కమిటీ వారి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీనాడు ఆదివారం ఉదయం ప్రేమ సమాజం ఆవరణలో గల కంచర్ల అన్నపూర్ణ దేవి ఆడిటోరియంలో విలంబి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ప్రేమసమాజం పిఆర్‌ఓ ఎం.వి.రాజశేఖర్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం ఏర్పాటు చేయడమైనది. ఈ పంచాంగ శ్రవణంలో నగరానికి చెందిన గాయత్రి కళాశాల సంస్కృత ఉపాధ్యాయులు పూడిపెద్ది కృష్ణకిరణ్ శర్మ పాల్గొని పంచాంగ శ్రవణం చేస్తారు. కావున విశాఖ వాసులెల్లరూ పంచాంగ శ్రవణంలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయమని కోరుచున్నాము.

# పింఛనుదారుల జనరల్ బాడీ సమావేశం

విశాఖపట్నంః అల్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ పెన్షనర్ల అసోసియేషన్ విశాఖపట్నం జనరల్ బాడీ సమావేశం బుధవారం నండూరి ప్రసాదరావు భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా అదనంగా ఒక డాక్టర్‌ను సిజిహెచ్‌ఎస్ వెలెనెస్ సెంటర్‌కు పోస్టు చేయాలని, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించాలని సమావేశంలో సభ్యులు సమగ్ర ఆమోదం తెలిపారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కె.బి.ఆర్.ప్రసాద్, యు. నరసింగరావు జాయింట్ సెక్రటరీ, జి.ఎస్.ఎన్.మూర్తి ట్రెజరర్, కె.వి.రామకృష్ణ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15,16 తేదీలలో రాష్ట్ర ఆహార కమిషన్ ఏజెన్సీలో పర్యటన

విశాఖపట్నం: ఛైర్ పర్సన్ జె.ఆర్.పుష్పరాజ్, ఛైర్మన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ మరియు ఐదుగురు కుటుంబసభ్యులు ఈనెల 15,16 తేదీలలో విశాఖ ఏజెన్సీలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 15వతేదీ ఉదయం 10.30 నుండి క్షేత్రస్థాయిలో సివిల్ సప్లైస్, మహిళా శిశు సంక్షేమశాఖ, పాఠశాలల విద్యా, వైద్య మరియు ఆరోగ్యశాఖ, లీగల్ మెట్రాలజీ శాఖలకు సంబంధించి పాడేరు డివిజన్, ఐటిడిఎ కాఫీ హౌస్ నందు వర్క్‌షాపు నిర్వహిస్తారు. తదుపరి కమిషన్ ఛైర్మన్, సభ్యులతో కలిసి 16వతేదీన అరకులో క్షేత్రస్థాయి పర్యటనలో పాల్గొంటారని వారు తెలియజేశారు.

# లారీ డ్రైవర్‌కు నాలుగు రోజుల జైలు

యలమంచిలి రూరల్ : మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడిన కేసులో నెల్లూరు జిల్లా నాయుడుపేట గ్రామానికి చెందిన రాజు అనే డ్రైవర్‌కు నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ యలమంచిలి న్యాయవాది ఆర్.కిశోర్‌బాబు తీర్పు ఇచ్చారని రూరల్ ఎస్సై రాము తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భాగంగా మద్యం తాగి లారీని నడుపుతూ పట్టుబడినట్టు చెప్పారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రాజుకు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు.

### టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రోలుగుంట : పది పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇ.అప్పారావు తెలిపారు. ఈ నెల 15 నుంచి జరగనున్న పది పరీక్షలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు పరీక్షా కేంద్రం మంజూరు అయింది. ఈ కేంద్రంలో మండలంలో గల ఈ పాఠశాల మినహా, మండ లంలో గల మిగిలిన 7 జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, కేజిబివి విద్యార్థులు, అలాగే రావికమతం మండలం నుంచి కొత్తకోట, దొండపూడి, అర్జా పురం, జెడ్.కొత్తపట్నం 250 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ ఏర్పాట్లను ఎంఇఓ పర్యవేక్షించి ఫస్ట్ ఎయిడ్ ఏర్పాట్ల కోసం పిహెచ్ సికి ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన సంఖ్య. eT-East-WAT-02-2018, తేదీ: 07.03.2018.

**పని పేరు:** వాల్తేరు డివిజన్ నందు పలాస-విశాఖపట్నం-దువ్వాడ, Ex. తెరుబలి (కి.మీ 327/2)-విజయనగరం నుండి RV లైను కొత్తవలస-కిరండుల్ (KK) లైను, కోరాపుట్-సింగపూర్ రోడ్ (KR) లైను, నౌపడ-గుణుపూర్ (NG) లైను, బొబ్బిలి-సాలూరు (BS) లైను మరియు MYD/విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సైడింగ్ యార్డు లైన్లు పైన UAV (డ్రోన్) ఉపయోగించి ఆర్థోఫోటో/ఫోటోగ్రామెట్రీ సర్వే.

**సుమారు పని విలువ:** ₹ 49,81,500/-. బయానా: ₹ 99,630/-. టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 3,540/-. పని పూర్తి చేయు కాలం: 08 (ఎనిమిది) నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 17.04.2018న 1330 గంటలకు.

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 10 (పది) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్) వాల్తేరు

PR-775/I/17-18

# విజయభాను సంపాదకీయం

## పార్లమెంటులో దాడుల పర్వం

రాష్ట్ర బడ్జెట్ సమావేశాల తొలిరోజే ప్రతిపక్షాల వ్యవహారణ తీరు పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే విధంగా ఉన్నది. ఓ సభ్యుడు విసిరిన హెడ్‌ఫోన్ నేరుగా సభాధ్యక్ష స్థానంవైపు దూసుకెళ్లి గోడకు తగిలి మండలి చైర్మన్ స్వామిగౌడ్ కంటికి తగిలింది. ప్రతిపక్షాల తీరు నిరసనల పరిధి దాటి దాడుల దాకా దిగజారటం దిగ్భ్రాంతికరం. పార్లమెంటరీ వ్యవస్థలో అధికారపక్ష విధాన లోపాలను ఎత్తిచూపటం, ప్రజానుకూల విధానాలకు పట్టుబట్టడం ఆరోగ్యకర, ఆహ్వానించదగ్గ విధానం. ఇలాంటి చర్చలే వ్యవస్థకు బలాన్ని చేకూరుస్తాయి. కానీ ఈమధ్య ప్రతిపక్షాల తీరు మరోలా మారిపోయింది. అధికారపక్షం ఏ పనిచేసినా, ఏ పథకాన్ని ప్రవేశపెట్టినా వ్యతిరేకించటమే, రచ్చచేయటమే పనిగా పెట్టుకున్నట్లుగా కనిపిస్తున్నది. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకునే వ్యూహంతో సభలోకి ప్రవేశించటం శోచనీయం. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కూడా ముందు జాగ్రత్తగా మార్షల్స్‌ను పెద్ద సంఖ్యలో మోహరించి సభాధ్యక్ష స్థానానికి రక్షణ ఏర్పరిచింది. అయినా ఇలాంటి ఘటన చోటుచేసుకోవటం పరిస్థితి తీవ్రతను తెలుపుతున్నది. ప్రజానుకూల విధాన రచనకు, రూపకల్పనకు వేదిక కావాల్సిన చట్టసభలు బల ప్రదర్శనల స్థాయికి దిగజారటం ప్రజాస్వామ్య ప్రియులను కలిచివేస్తున్నది. అయితే ఇదేదో కాకతాళీయం గా, పొరపాటుగా జరిగిందని సరిపెట్టుకునే పరిస్థితులు లేకపోవటమే ఇప్పటి విషాదం. కొంతకాలంగా చట్టసభల్లో చోటుచేసుకుంటున్న విపరీత పరిణామాలు ఏ మాత్రం సమర్థనీయంగా లేవు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి చర్చలే జవము, జీవమూ అన్న విషయాన్ని మరిచి ప్రవర్తిస్తున్న తీరుతో చట్టసభల విలువల పత నం పాతాళంలో పడిన స్థితిని తెలుపుతున్నాయి. దీనికి పార్లమెంటు మొదలు, వివిధ రాష్ట్రాల అసెంబ్లీలు వేదికలు కావటం దిగజారుతున్న చట్టసభల ప్రతిష్ఠకు తార్కాణం. కేరళ అసెంబ్లీలో బడ్జెట్ ఘట్టం మునుపెన్నడూ ఎరుగని బీభత్స కాండకు వేదికైంది. ముడుపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్థికమంత్రి కె.ఎం.మణి వార్షిక బడ్జెట్ పెట్టకుండా అడ్డుకుంటామని విపక్ష ఎల్‌డీఎఫ్ ముందుగానే ప్రకటించింది. ఆరునూరైనా బడ్జెట్ ప్రవేశపెట్టి తీరుతామని కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పం తానికి పోయింది. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య అక్షరాలా యుద్ధమే జరిగింది. ఏకంగా సభాపతి కుర్చీనే ఎత్తి బయటపడేశారు. ప్రతిపక్ష సభ్యుల రణగొణ ధ్వనుల మధ్య ఆరు నిమిషాల్లోనే 140 పేజీల బడ్జెట్‌ను చదివేశారు! ఈ క్రమంలో జరిగిన విధ్వం సం అంతాఇంతా కాదు. వైరిపక్షీయుల్ని కొట్టి, కొరి కి, నెట్టి, కంప్యూటర్లు బద్దలుకొట్టి, బల్లలపై ఎక్కి చిందులు తొక్కి సృష్టించిన మహా గందరగోళం కేరళనే కాదు, యావత్ భారతావనినే దిగ్భ్రాంతి పరిచింది. ఇక తమిళనాట అసెంబ్లీలో జరిగిన కీచులాట, కీచకపర్వం తెలియంది కాదు. ఒడిషా శాసన సభలోనూ జరిగిన దొమ్మిలో ముఖ్యమంత్రి దవాఖానకు వెళ్లి కట్టు కట్టించుకోవాల్సి వచ్చింది. మరో సందర్భంలో గవర్నర్‌నూ ఉతికి ఆరేసిన తీరూ ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో వీధిపోరాటాలు దర్శనమిచ్చాయి. బీహార్‌లో తప్పతాగివచ్చిన ఓ సభ్యుడు మల్లయుద్ధానికి దిగిన ఉదంతం ఉన్నది. మధ్యప్రదేశలో పాదరక్షలు తలలకు తగిలి నెత్తురును కళ్లచూశాయి. ఈ నేపథ్యంలోంచే పార్లమెంటులో పెప్పర్ స్ప్రే కూడా ప్రజాస్వామ్య విలువలను మసకబార్చింది. ఇలాంటి దురావేశ, దుశ్చేష్టలు ప్రజాస్వామ్యానికి ప్రమాద సంకేతాలు చర్చలతో నడిచేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యమని తొలినాటి సభాపతి మవలాంకర్ ఉద్బోధించారు. చట్టసభలను సజావుగా చర్చలకు సరైన వేదికలుగా నిలువనివ్వకుండా బలప్రదర్శన శాలలుగా భ్రష్టుపట్టిస్తున్న నేరం, పాపం రాజకీయపక్షాలది, గౌరవసభ్యులది. ఔన్నత్యాన్ని మరి చి వ్యవహరిస్తే మిగిలేది అరాచకమే. దేశవ్యాప్తంగా ఇటువంటి వికృత పోకడలు సాగుతున్న తరుణంలో తెలంగాణ సభ ఇందుకు భిన్నంగా ఆదర్శప్రాయంగా సాగాలని కోరుకోవడం అత్యా శ కాదు. మునుపెన్నడూ లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత అసెంబ్లీ గౌరవప్రదం గా, అర్థవంతంగా నడిచిన తీరు దేశానికే ఆదర్శంగా నిలిచింది. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రతిప్రశ్నకూ సమాధానాలివ్వటం కోసం కాలపరిమితి లేకుండా గత బడ్జెట్ సమావేశాలు నడిచిన తీరు ఉండనే ఉన్నది. అయినా ఫక్తు రాజకీయ కారణాలతో చట్టసభ వేదికను రచ్చ చేయటం ప్రజారాజకీయం అనిపించుకోదు. ఇప్పుడు రాష్ట్ర అసెంబ్లీలో జరిగిన దుర్ఘటనలు దురదృష్టకరమైనవే. సభలు సజావుగా ప్రయోజనాత్మకంగా జరిగేందుకు శాసనసభా స్పీకర్ కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదనిపిస్తున్నది. ఈ క్రమంలో రాజ్యసభ చైర్మన్‌గా నారాయణన్ చెప్పిన మాటలు గమనార్హమైనవి. చట్టసభ సర్వసత్తాక వ్యవస్థ కాబట్టి గౌరవ సభ్యులంతా స్వీయ సమీక్షతో తప్పులు గ్రహించాలి, దిద్దుకోవాలి. అవసరమైతే తనను తాను శిక్షించుకోవాలన్నారు ఆయన. నిజానికి ఇప్పుడు కావాల్సింది ఈ స్ఫూర్తేనని తేటతెల్లమవుతున్నది.

## మహిళల కళ్ళల్లో ఆనందం నిండాలి



అన్నవరం/తొండంగి : తూ.గో.జిల్లా తొండంగి మండలం తొండంగి గ్రామంలో బుధవారం మండల ప్రథమ పౌరురాలు శ్రీమతి చిట్టిమురి సంధ్య గారి అధ్యక్షతన తొండంగి మండల మహిళా సమాఖ్య వారిచే తొండంగి గ్రామంలో వున్న ప్రతీడ్వాక్రా గ్రూపు సభ్యురాలికి మన ప్రియతమ ముఖ్యమంత్రి గౌ.శ్రీ.నారా చంద్రబాబు నాయుడు ప్రతి 'మహిళ కళ్లల్లో ఆనందం నిండాలి', 'ప్రతీ మహిళా సాధికారత సాధించాలి' అని రూ.2000 చొప్పున ప్రతీ మహిళకి అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మండల జన్మభూమి కమిటీ ఛైర్మన్ శ్రీ యడ్ల బేతాళుడు(రాజా) విచ్చేసి ప్రొసీడింగ్ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మహిళలను ఉదేశించి మాట్లాడుతూ మన ప్రభుత్వం మహిళా సాధికార ప్రభుత్వం.ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలి, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి. సాధికార మిత్రల నియామకం ఈ ఏడాది మరో వినూత్న కార్యక్రమం.గ్రామాభివృద్ధి, పేదల సంక్షేమంలో ప్రభుత్వా నికి, ప్రజలకు మధ్య వారధిగా సాధికార మిత్రలుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజాల్లోకి తీసుకెళ్లాలి అని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎపిఎమ్ వై.సత్తిబాబు, మండల సమాఖ్య అధ్యక్షులు మరియా గారు, సిసి సరస్వతి, ఎపిఎమ్ పిఓ శివమూర్తి, గ్రామ జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పేరున ప్రత్యేక పూజలు



అన్నవరం : తూ.గో.జిల్లా జనసేన పార్టీ 4 సంవత్సరములు పూర్తి చేసుకొన్న సందర్భంగా అన్నవరం జనసేన పార్టీ కార్యకర్తలు శ్రీ సత్యదేవుని సన్నిధిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తలపెట్టిన జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ విజయ వంతంగా జరగాలని నాగం.రమేష్ శ్రీ స్వామివార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తేట గుంట. హరిబాబు, హరికుమార్, శివ, దుర్గాప్రసాద్, సిహెచ్.ప్రసాద్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

- కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : మహిళల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ విశాఖ సాధ్యపడుతుందని జివియంసి కమిషనర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. భీమిలి జోనల్ కార్యాలయం ఆవరణలో బుధ వారం నిర్వహించిన కార్య క్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆప్ భీమిలి గ్రేటర్ ఆధ్వర్యంలో 1000 మందికి తడి-పొడి చెత్త కోసం చెత్త బుట్టలను అందజేయడం స్వచ్ఛ విశాఖకు దోహద పడుతుందని అబిలషించారు. అదేవిధంగా సామాజిక బాధ్యతతో దివీస్ లేబరెటరీస్ చెత్త రవాణా వాహనం ట టాటా ఏస్ ను రఊ.7.50 లక్షలతో అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్, దివీస్ లేబరెటరీస్ స్ఫూర్తితో మరింత మంది ముందుకు రావాలని ఆకాంక్షించారు. తొలుత యస్‌యస్‌సి పరీక్షలకు హాజరయ్యే విద్యార్ధిని, విద్యార్ధులు శతశాతం ఫలితాలు, 10/10 ర్యాంక్ సాధించాలని సర్వమత పెద్దలతో ఆసీర్వ చనం గావించారు. అనంతరం రూ. 60 లక్షల చెక్కును 12 యస్.హెచ్.జి గ్రూపులకు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రజలలఓ చైతన్యం, స్వచ్ఛతపట్ల ఆసక్తి కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. తొలుత టాటా ఏస్ వాహనాన్ని జెండా ఊపి కమిషనర్ ప్రారంభించారు.

కార్యక్రమానికి భీమిలి జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డా.పద్మావతి, గ్రామపెద్ద నూకరాజు, దివీస్ ప్రతినిధి, లయన్స్ ప్రతినిధి ప్రసంగించారు.

## జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బైక్ ర్యాలీ

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరంలో జనసేన నాయకులు, కార్య కర్తలు బుధవారం జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్క రించుకొని తొండంగి మండలం దానవాయిపేట గ్రామం నుంచి అన్నవరం వరకు జనసేన జండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం గుంటూరులో జరిగే జనసేన మహాసభ విజయవంతంగా జరగాలని జనసేన కార్యకర్తలు బైకులపై ర్యాలీ గా అన్నవరం చేరుకొని కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడు శ్రీ సత్యనారాయణ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తొలి పాంచాల వద్ద కొబ్బరికాయలు కొట్టి జనసేన మహాసభ విజయవంతం కావాలని జనసేన కార్యకర్తలు బైక్ ర్యాలీ చేశారు. ఈ కార్య క్రమంలో మామిడాల లోకేష్ .డి.మణికుమార్, సి.అరవింద్, ఎన్.మోహన్,యమ్ .గణేష్, జి.వీరేంద్ర, రాంబాబు, మణికంఠ, రుషి తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ నాయకుల విగ్రహలకు రూ.30వేలు విరాళము

అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం గ్రామంలో స్థానిక మాదిగ పేటలో ఏర్పాటు చేయబోయే డాక్టర్ .బి ర్ .అంబెడ్కర్ మరియు బాబు జగజ్జీవనరావు నూతన విగ్రహాలకు అన్నవరం గ్రామం వైస్సార్ పార్టీ నాయకుడు ధార వెంకటరమణ సుమారు ముప్పైవేల రూపా యలు విరాళంగా స్థానిక గ్రామా నాయకుల సమక్షంలో ఇవ్వడమైనది ఈ కార్యక్రమంలో స్థానిక బాబుజగజ్జీవన్రావు యూత్ పాల్గొనడమైనది.

## కవి సమయం

### సార్ధకత

కన్ను తెరిస్తే జననం
కన్ను మూస్తే మరణం
మధ్యనే ఈ మహా నాటకం
తెలుసుకోవాలి జీవితం అతి స్వల్పం
భోగభాగ్యాలకై అర్రులు చాచక
సుఖ సంపదలకై పరుగులిడక
సత్కర్మలను ఆచరిస్తూ
పరుల మేలుకై పాటు పడుతూ
నిరంతరం భగవన్నామస్మరణలో జీవిస్తూ
కర్త్వ్యున్ముఖులై సానుకూల ధృక్పథంతో
సాగిన జన్మకు కలుగును సార్ధకత

... కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 9063622665

## పంచాంగం

మాసం : ఫాల్గుణ ; తిథి: త్రయోదశి సా.4.36; ధనిష్ట సా.4.41; రా.వ.12.22ల 2.05.

గురువారం 15-03-2018

a **మేషం** : ఉమ్మడిగా చేసిన వ్యాపార లావాదేవీలు లాభసాటిగా ఉంటాయి. నిరుద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. దూరపు బంధువులు కలుసుకుంటారు. విందు, వినోద కార్యకలాపాలలో పాల్గొంటారు.

b **వృషభం** : ఉన్న విద్యా విషయాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. కళలు, రాజకీయ , న్యాయ రంగాల, వారికి శుభప్రదం. రవాణా, ఎగుమతులు, దిగుమతులు, విదేశీ వ్యవహారాల రంగాల వారికి ప్రోత్సాహకరం.

c **మిథునం** : సినీ, రాజకీయ, ప్రభుత్వ రంగాల వారికి ప్రోత్సామకరంగా ఉంటుంది. పై అధికారుల ప్రోత్సాహంతో లక్ష్య సాధనకు ప్రయత్నిస్తారు. కుటుంబ పెద్దల విషయంలో శుభపరిణామాలు సంభవం. ఆర్థిక లాభం.

d **కర్కాటకం** : రుణయత్నాలు మాత్రమే ముందుకు సాగుతాయి. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు.ఆర్థిక సంస్థలలో పనులు పూర్తి అగును. పెండింగ్ వ్యవహారాలు కొలిక్కి వస్తాయి. చిన్న తరహా పరిశ్రమల్లో పనిచేసిన వారికి అధికారుల మన్నలనలు పొందుతారు. ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయి. కళారంగం వారికి లాభం.

e **సింహం** : స్నేహ బంధాలుల మెరుగుపడతాయి. పట్టుదలతో శ్రమించి లక్ష్యాలు సాధిస్తారు. స్నేహితుల అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకుంటారు. వాటి వలన సత్ఫలితాలు లభిస్తాయి. వ్యాపారస్థులకు లాభం.

f **కన్య** : శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసాన్ని కలిగిస్తుంది. బ్యాంకింగ్, చిట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. ఎవరికైనా ధన సహాయం చేసినా తిరిగిరాజాలదు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి గుర్తింపు లభిస్తుంది. చిన్నారుల, ఖరీదైన వస్తువుల కొనుగోలు విషయంలో ఖర్చులు అంచనాలను మించుతాయి.

g **తుల** : ప్రయాణాలు అనుకూలంఆ సాగును. విలువైన వస్తువులు కొంటారు. ఆరోగ్యం జాగ్రత్త. ఖర్చులు అధికంగా ఉంటాయి. దూర ప్రయానాలు కలిసివస్తాయి. పాత బాకీలు వసూలు అగును. ముఖ్య సమాచారం అందుతుంది. ఉద్యోగస్తులకు పెండింగ్ పనులపై దృష్టి సారిస్తారు. ఆలయాలను సందర్శిస్తారు.

h **వృశ్చికం** : ఆర్థిక కుటుంబ విషయాలపట్ల దృష్టి సాగిస్తారు. విదేశీ వస్తువులు సేకరిస్తారు. బ్యాంకింగ్, చిట్స్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమవుతుంది. ఆలయాలను సందర్శిస్తారు. ఉద్యోగస్తులు అధికారులతో మాటపడకుండా తగిన జాగ్రత్త వహించండి. కొబ్బరి, పండ్లు, పూలు, పానియ వ్యాపారులకు కలిసివస్తుంది.

i **ధనుస్సు** : తొందరపాటుతనం వల్ల కుటుంబీకులు, అవతలి వారితో మాటపడవలసి వస్తుంది. స్త్రీలు వీలైనంత వరకు మితంగా సంభాషించడం మేలు. ఖర్చులు అధికమవుతాయి. హోటల్, తినుబండారాలు, బేకరీ పనివారులకు లాభదాయకంగా ఉంటుంది.

j **మకరం** : సిమెంటు, కలప, ఐరన్, ఇటుక వ్యాపారుకు మిశ్రమ ఫలితం. స్త్రీలకు కాళ్ళు, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కొంటారు. వైద్య, ఇంజనీరింగ్ రంగంలోని వారికి ఏకాగ్రత ఎంతో ముఖ్యం, పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. అసాధ్యమనుకున్న పనులు సునాయసంగా పూర్తిచేస్తారు.

k **కుంభం** : ఆరోగ్య విషయంలో జాగ్రత్త, ఔషధ సేవ చేస్తారు. కీళ్ల నొప్పులు ఉదర సంబంధిత వ్యాదులు మిమ్మల్ని కలవరపెడతాయి. ఖర్చులు అధికకం. ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు సన్నిహితుల వలనలాభం.

L **మీనం** : గంతలో మీరు చేసిన కృషి ఫలిస్తుంది. రచనరంగంలో ఉన్నవారికి మంచి ప్రోత్సాహకరంగా ఉంటుంది. జాయింట్‌గా వ్యాపార సంస్థలు నడుపు వారికి లాభదాయకంగా ఉంటుంది. కాంట్రాక్టర్లకు నూతన అగ్రిమెంట్లు కలిసి వస్తాయి ఆర్థికంగా లాభం, ఆరోగ్యం జాగ్రత్త.

# సాయిబాబా చిన్న కథలు



### దిల్ మే రామ్ హాథ్ మే కామ్

హనుమంతుడు సీతాన్వేషణకు బయలుదేరి లంకను చేరాడు. అక్కడ విభీషణుడు చాలా బాధపడుతూ హనుమంతునితో "హనుమంతుడా! ఎంత అదృష్టవంతుడవోయి! నిరంతరం రామ సేవ చేస్తూ రామానుగ్రహం పొందావు. ఎంతకాలం నుండియో రామ నామాన్ని స్మరిస్తున్నాను. కానీ రామదర్శనం నాకు ప్రాప్తించలేదు." అని పలికాడు. హనుమంతుడు ఈ మాటలు విని "విభీషణా! రామ నామాన్ని స్మరిస్తున్నానే కానీ రామ కార్యంలో ఏమైనా పాల్గొన్నావా? రామ కార్యంలో పాల్గొనకున్నచో రామానుగ్రహం నీకు ఎట్లు లభించగలదు? ఈ లంకా సామ్రాజ్యంలో సీతాదేవి ప్రవేశించి 10 నెలలు అయినది. నీవు ఆ సీతమ్మ తల్లికి ఉప శాంతి కలుగునట్లు ఏమైనా బోధించినావా? లేక ఆ తల్లిని ఒకసారైనా దర్శించినావా? ఆమె బాధలు నివారించడానికి ఏమైనా కొన్ని ఉపాయములు ఆలోచించినావా? ఈ కార్యములను చేపట్టి యున్నట్లయినచో అదంతా రామ సేవగా మారిపోయి వుండేది. ఆ రీతిగా చెయ్యలేదు కదా! మరి నీకు రామానుగ్రహం ఏ విధంగా లభ్యమగును? నేను నోటితో రామ నామాన్ని జపిస్తూ, జీవితాన్ని రామ కార్యానికి అంకితం చేశాను" అని పలికాడు.

కేవలం నోటితో మంత్రాలు వల్లించినంత మాత్రాన లాభం లేదు. భగవన్నామమును స్మరించిననూ ప్రయోజనముండదు. భగవత్కార్యములందు ప్రవేశించాలి. అందుకనే స్వామి ఎప్పుడూ చెప్తుంటారు. "దిల్ మే రామ్ హాథ్ మే కామ్" అని.

### శరణాగతి

ఒక భక్తుడు నిరంతరం " నారాయణ, నారాయణ" అని స్మరిస్తూండేవాడు. అతడు పండితుడు కూడా. అతను ఒకసారి ఒక మహారాజు దగ్గరకు వెళ్లి తన పాండిత్యాన్ని ప్రదర్శించాడు. రాజు అతనికి కానుకలతో పాటు పట్టు వస్త్రమిచ్చాడు. అతడు ఆ పట్టు వస్త్రమును ఎంతో సంతోషముగా ధరించేవాడు. ఒకనాడు, ఈ పండితుడు నదికి స్నానం చేయడానికి వెళ్లాడు. తన పట్టు వస్త్రాన్ని ఉతికి నది గట్టు మీద ఆరవేశాడు. తాను స్నానం చేసి అనుష్ఠానం చేయడానికి కూర్చున్నాడు. గాలికి ఆరవేసిన పట్టు వస్త్రం ఎగిరిపోయింది. కొంత దూరంలో ఒక చాకలి బట్టలు ఉతుకుతున్నాడు. ఈ పండితుడు అనుష్టానం పూర్తి చేసుకుని చూస్తే పట్టు వస్త్రం లేదు. అక్కడ బట్టలుతుకుతున్న చాకలి కట్టుకున్న పట్టు వస్త్రం మీద అతని దృష్టిపడిందది. అతడు రాజుగారి బట్టలుతికే చాకలి. రాజుగారు పండితునికిచ్చిన పట్టు వస్త్రము లాంటి దానిని మరొకటి ఉదుకుటకు వేశారు. చాకలి ముచ్చటపడి ఉతుకుటకు ముందు కొంత సేపైనా కట్టుకుం దామని ఆ పంచెను కట్టుకున్నాడు.

...సశేషం

## సంకీర్తన



రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను
Minimum 7 days
క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# నూకాలమ్మ ఉత్సవాలు ప్రారంభం



భీమునిపట్నం : భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలకు ఏర్పాటులు ఘనంగా చేస్తున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు వాసు పల్లి.కొండ బాబు విలేఖర్లతో మాట్లాడుతూ నూకాలమ్మ ఉత్సవాలు గురువారం నుంచే ప్రారంభం అవుతాయని, తొల్లెల్లు ఉత్సవం గురువారం రాత్రి పది గంటలకు గంట స్తంభం వద్ద మందుగుండ కార్యక్రమం ప్రారంభం అవుతాదని అర్ధరాత్రి ఒంటి గంటకు చదును పట్టు నుంచి అమ్మవారి ప్రతి రూపం తంగేటి పూలతో అలకరించిన గరగ తో చెక్క బజన, కోలాటాలు, సాముగరడిలు, పులివేషాలు, బండ్ల వేషాలు, వివిధ నెల వేషాలతో పాటు బోయివీది, ఎగువపేట,దాసరికాలు, అమ్మవారి గరగ ను పురవీధుల్లో ఊరేగిస్తారని అన్నారు.

ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాటులు చేస్తున్నామని అన్ని వీధిలలో లైట్లు గేటు లను ఏర్పాటు చేశామని. అలాగే నాలుగు రోజులు పాటు వివిధ సంస్కృతి కార్యక్రమాలు జరగుతాయని ఆయన అన్నారు. అలాగే బీచ్ వద్ద పిల్లల్లు ఆడు కోవడానికి జైయిట్ వీల్,సర్కస్,డ్రాగన్ ట్రైన్, అన్ని సదుపాయాలు సమకూర్చామని అన్నారు. .అలాగే అనుపోత్సవం పదహారు సాయంత్రం గ్రంధాలయం వద్ద జరుగుతాదని.అక్కడ మందు గుండు తో పాటు వివిధ నెల వేషాల ప్రదర్శనలు చేస్తారు,

ఈ ఉత్సవాలు ఉగాది వరకూ గణంగా జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి గిడుతూరి.శ్రీనివాసరావు ,కోశాధికారి పలుకూరి. శీనివాసరావు, అర్గనైజింగ్ సెక్రటరి , గాడు.అప్పలనాయుడు (ఆనంద్), కో ఆర్డినేటర్, కాసరపు.పెద్ద ఎల్లాజీ అమ్మ వారి భక్తులు ఉత్సవ కమిటీ సభ్యులు, భీమిలి డివిజన్ టీడీపీ అధ్యక్షులు గంటా.నూకరాజు ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

# పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ

నాతవరం : టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ అన్నారు. బుధవారం మర్రిపాలెం గ్రామం టిడిపి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలోనే జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందేలా కార్యకర్తలు చూసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఇప్పటి నుంచే కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శింగంపల్లి సన్యాసిదేముడు, జెడ్పీటీసీ కరక సత్యనారాయణ, వైస్ ఎంపిపి వీసం చిట్టిబాబు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# 18న ఉగాది 'హాస్యావధానం'

## - బాలల పద్యపఠనం, విచిత్ర వేషధారణ సంప్రదాయ వస్త్రధారణలో వచ్చే కుటుంబానికో పట్టుచీర


విలేకర్ల సమావేశంలో హాస్యావధానం గురించి వివరిస్తున్న పరవస్తు ఫణిశయన సూరి

విశాఖపట్నం : పరవస్తు పద్యపీఠం ఆధ్వర్యంలో శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఈ నెల 18వ తేదీ ఆదివారం సాయంత్రం సిరిపురం కూడలి లోని ఆంధ్ర విశ్వకళాపరిషత్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసెంబ్లీ హాలులో ప్రపంచ ప్రఖ్యాత 'హాస్యబ్రహ్మ' శంకర నారాయణచే 'హాస్యావధానం' నిర్వహించ నున్నట్టు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఫణిశయన సూరి వెల్లడించారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరవస్తు 'బాల చంద్రిక' పేరిట పద్యపీఠం బాలలచే పద్య పఠనం, విచిత్ర వేషధారణల, సరస్వతీ నృత్య కళామందిర్ (పెందుర్తి) వారిచే స్వాగత నృత్య ప్రదర్శనలతో ఈ వేడుక ఆద్యంతం సంప్రదాయ బద్దంగా రూపొందించామన్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆరు గంటల మధ్య కుటుంబసమేతంగా సంప్రదాయ వస్త్రధారణలో హాజరయ్యేవారి పేర్లు నమోదు చేసి కార్యక్రమం ముగింపు సందర్భంగా అతిథుల చేతుల మీదుగా షడ్రుచులకు ప్రతీకగా ఎంపిక చేసిన ఆరు కటుంబాలకు కుటుంబానికో 'పట్టుచీర' బహూకరించి భారతీయ సంప్రదాయ వస్త్రధారణకు పెద్దపీట వేస్తామని ఆయన వివరించారు. ప్రేక్షకుల్ని పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వించే ఈ హాస్యావధానానికి సంచాలకులుగా డాక్టర్ పేరాల బాల మురళీ కృష్ణ, పృచ్ఛకులు (ప్రాశ్నికులు)గా లాఫ్టర్స్ ఫన్ క్లబ్ వ్యవస్థాపకలు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గ్రహీత కోరుకొండ రంగారావు, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ప్రధాన కార్యదర్శి జీవీ త్రినాథ్, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకలు డాక్టర్ ఎన్.ఎస్.ఆర్. కృష్ణారావు, మన జాగృతి అధ్యక్షురాలు జవ్వాది జాగృతి, నటులు దర్శకులు కె. శేషగిరి రావు, కాశీ విశ్వనాథ్ క్రియేటివ్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకలు ఎస్. శ్రీధర్ వ్యవహరిస్తారని సూరి వివరించారు. హెచ్‌పీసీఎల్ డీజీఎం వైవీఎన్ శర్మ మాట్లాడుతూ ఈ సందర్భంగా నిర్వహించే సభాకార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీ జ్యోతిర్మయి అధ్యక్షులుగా వ్యవహరిస్తారని ముఖ్య అతిథులుగా ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఉప కులపతి ఆచార్య గొల్లపల్లి నాగేశ్వర రావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి. సృజన,ఆంధ్ర విశ్వ కళాపరిషత్ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమా మహేశ్వర రావు, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత డాక్టర్ సూరపనేని విజయ్ కుమార్ హాజరవుతారన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో పరవస్తు పద్యపీఠం ప్రతినిధులు బొడ్డేటి జగత్ రావు, టేకుమళ్ల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పది పరీక్ష పరీక్షే

## - నేటి నుంచి పది పరీక్షలు - అరకొర సౌకర్యాలే దిక్కు..!

రావికమతం : పదో తరగతి పరీక్షలు విద్యార్థులకు పెద్ద పరీక్షగానే మారింది. ఈ నెల 15 నుంచి 28వరకూ జరగనున్నాయి. అయితే పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కొరవడ్డాయి. మండలంలో ఈ ఏడాది 1,012 మంది విద్యార్థులు పది పరీక్షలు రాస్తున్నారు. వీరికి మరుపాక మోడల్ స్కూల్, రావికమతం హైస్కూల్, బాలికల హైస్కూల్, కొత్తకోట హైస్కూల్, జూనియర్ కళాశాల, మెయిన్ స్కూల్ సెంటర్లలో పరీక్షలు జరగనున్నాయి. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం రావికమతంకు మూడు కిలో మీటర్ల దూరంలో ఉంది. 150 మంది ఇక్కడ పరీక్షలు రాయనున్నారు. అయితే రవాణా సౌకర్యం లేదు. అనకాపల్లి నుంచి ఒక బస్సు వస్తున్నా పరీక్షా సమయానికి అందదు. దీంతో విద్యార్థులు ఆటోలు, సైకిళ్ల ఆధారంగా వెళ్లాల్సిందే. రావికమతం హైస్కూల్లో 200 మంది పరీక్ష రాయనున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు లేవు. పైగా ప్రహరీ ఆనుకొని పెద్ద డంపింగ్ యార్డు ఉంది. నిత్యం ఆ డంపింగ్ తగలబడుతూ ఉండటంతో పొగతో విద్యార్థులుఅవస్థలు పడక తప్పదు. బాలికల హైస్కూల్ కొంచెం మెరుగ్గా ఉందనే చెప్పాలి. 250 మంది విద్యార్థులు పరీక్షలు రాసే కొత్తకోట హైస్కూల్‌లో ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉంది. మెయిన్ స్కూల్, జూనియర్ కాలేజిల్లో విద్యార్థులకు బెంచీల సౌకర్యం సరిగ్గా లేదు. జూనియర్ కాలేజిలో సింగిల్ బెంచీలు ఉండగా, మెయిన్ స్కూల్లో బెంచీలు సౌకర్యవం లేదు. ఒక ప్రైవేటు స్కూల్ నుంచి బెంచీలు తీసుకొస్తామని అధికారులు తెలిపారు. అయితే సెంటర్లలో కొన్ని గదులకే మాత్రమే ప్యాన్‌లు పరిమితమయ్యాయి. ఏదిఏమైనా నేడు జరగబోయే పది పరీక్షలు విద్యార్థులకు పెద్ద పరీక్షగానే ఉన్నాయి.

# 10వతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## ఎంఇఓ ఆర్.ఆర్.కె.నర్సింగ్‌రావు

సబ్బవరం: సబ్బవరం మండలంలో 10వతరగతి పరీక్షల నిర్వహణకు అన్ని కేంద్రాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఓ ఆర్.ఆర్.కె.నర్సింగ్‌రావు తెలిపారు. పరీక్షలు నిర్వహించే పాఠశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలలో 889 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మండల కేంద్రంలోని ప్రతిభా విద్యాలయంలో 270మంది విద్యార్థులకు 11గదులు ఏర్పాట్లు చేశామన్నారు. బాలయోగి గురుకులంలో 249 మంది విద్యార్థులు, ప్రభుత్వ హైస్కూల్‌లో 240మంది విద్యార్థులు, రావలమ్మపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 130మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

ఈనెల 15నుంచి 29వతేదీ వరకు జరుగుతాయని అన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్ష జరుగుతుందని అన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన తెలిపారు.

# సరుగుడుతోట దగ్ధం



పరవాడ: మండలంలోని భరిణికం గ్రామంలో బుధవారం ఉదయం సుమారునాలుగుఎకరాలసరుగుడుతోట దగ్ధం అయ్యింది. వివరాలలోకి వెళ్ళగా భరిణికం రెవెన్యూ పరిధి భరిణికం నుండి బాపడ పాలెం వెళ్ళే మార్గం లో సిగరెట్ కాల్చి పడవేయడం వలన సుమారు 4 ఎకరాలు సరుగుడు తోట కాలిపోవడంతో అనకాపల్లి, పార్మాసిటీ, ఎన్టీపిసి ఫైర్ ఇంజన్లు సహాయంతో మంటలను అదుపు చెస్తూన్నాయి. సంఘటన స్థలాన్ని పరవాడ సి.ఐ స్వామినాయుడు, పరవాడ ఆర్.ఐ భాగ్యలక్ష్మి తదితరులు పరిశీలించారు.

# నూకాంభిక అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు



అనకాపల్లి : ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు, బుధవారం జరిగింది. 120 రోజులకు గాను, 24లక్షల 85 వేల 869 రూపాయలు, 96.5 గ్రాముల బంగారం, 1850 సిల్వర్, అన్నధానానికి 31,175 రూపాయలు ఆదా యం వచ్చింది. ఈ లెక్కింపు కార్యక్రమం డిప్యూటీ కమీషనర్ ఎన్‌వీఎస్ మూర్తి, పర్యవేక్షణలో ఆలయ ఈవో సుజాత అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో దేవా దాయ ఇన్స్‌పెక్టర్ రాజు, సుధారాణి, అభివృద్ధి కమిటీ సభ్యులు, బుద్ద నాగ జగదీశ్వరరావు, కొణతాల వెంకటరావు, మళ్ల సురేంద్ర, డాక్టర్ నారాయణ రావు, ఆడారి జగన్నాధరావు, బిఎస్ ఎంకె జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి కృషి


మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షులు శ్రీరంగస్వామి

నర్సీపట్నం : గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి కృషి చేస్తున్నామని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు లాలం శ్రీరంగస్వామి అన్నారు. బుధవారం మంత్రి అయ్యన్న నివాసంలో టీడీపీ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరంగ స్వామి మాట్లాడుతూ పార్టీని గ్రామాల్లోకి తీసుకు వెళుతున్నామన్నారు. గ్రామాల్లో అనేక కార్యక్రమాల ద్వారా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు అందేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సుకల అప్పల నాయుడు, నాయ కులు ఈర్లె రాజు బాబు, లాలం గోవింద, శ్రీరామ్మూర్తి, వెంకునాయుడు, గోవింద నాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతులకు అవగాహన

భీమునిపట్నం : భీమిలి మండలం సింగనబంద మద్దిలపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఇందులో భీమిలి వ్యవసాయదికారి సి.హెచ్ సంధ్యా రత్న ప్రభ మాట్లాడుతూ గ్రామములలో మట్టి నమూనాలను సేకరించి వాటి ఫలితాలను రైతులకు వివరిస్తామని ఆమె అన్నారు.

రబీలో ఆర్ జి ఎల్ రకం ఎకరాకు 28 బస్తాలు దిగుబడి వచ్చిందని అన్నారు.

జీరో టిల్లెజ్ పద్ధతిని అనుసరిస్తే మొక్కజొన్న సాగు గణనియమగా తగ్గుతుందని తెలిపారు.

# మూడు కేంద్రాల్లో పది పరీక్షలు

కొయ్యూరు : మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 12 పాఠశాలలకు చెందిన 645 మంది విద్యార్థులు గురువారం నుంచి పదో తరగతి పరీక్షలు రాయనున్నారని ఎంఇఒ బోడంనాయుడు తెలిపారు. 314 మంది బాలురు, 331 మంది బాలికలు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. గురుకుల, ప్రభుత్వోన్నత ఆశ్రమ పాఠశాలల్లో తొమ్మిది గదుల చొప్పున మొత్తంగా 27 గదులను పరీక్షలకు కేటాయించారన్నారు. ఆశ్రమ పాఠశాలకు బుచ్చిబాబును, ప్రభుత్వోన్నత పాఠశాలకు సోంబాబును, గురుకుల పాఠశాలకు సిహెచ్.ప్రభాకర్ అనే అధికారులను నియమించారని తెలిపారు.

# పోలీస్ స్టేషన్లోనే చదువులు ....

## భర్త చూడడూ .... చట్టం కనికరించదు....





పెందుర్తి : తనకు న్యాయం చేయాలని కోరుతూ నెల రోజులుగా మహిళ పోలీస్ స్టేషన్ చుట్టు తిరుగుతున్న గృహిణి తగువులాడుకుంటున్నా తల్లి తండ్రులు ... తల్లడిల్లిపోతూన్నా పిల్లలు ... పోలీస్ స్టేషన్లోనే చదువులు వి.ఎస్.పి 14.3 మహిళ ( పెందుర్తి ) తల్లితండ్రులు లిద్దరూ తగువులాడుకోని ... న్యాయం కోసం పోలీసు స్టేషన్ చుట్టు తల్లి నెలలు తరబడి కాళ్లు అరిగేలా పిల్లిల్ని పట్టుకుని తిరుగుతూంది. పిల్లలేమో తల్లి చుట్టు తిరుగుతున్నారు. దీనితో ఈ చిన్నారులు చదువులు వీదిన పడ్డాయి. అయిన సరే ఆ చిన్నారులు చదువును ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా పోలీస్ స్టేషన్లోనే చదువుకుంటున్నా దృశ్యం అందరిని కంట తడి పెట్టించింది. ఈ దృశ్యం విశాఖ పోలీస్ కమీషనరేట్ లో ఉన్నా మహిళ పోలీస్ స్టేషన్లో కంట పడింది. కంచరపాలెంకు చెందిన వజ్రపు సుజాతకు అదే ప్రాంతానికి చెందిన సతీస్‌కు 6 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం జరిగింది. విరి కాపురం 3 ఏళ్ల పాటు సజావుగానే సాగింది. ఆ తరువాత సతీస్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోని ... సుజాతను వేదించడం మొదలు పెట్టాడు. సుజాతకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. వీరి ఆలాన పాలన సతీష్ ఏ మాత్రం పట్టించుకోలేదు సరి కదా ... సుజాతను ఇంటి నుండి గంటేసాడు. దీనితో సుజాత జీవితం తన బిడ్డలతో వీదిన పడింది. దీనితో ఆమె న్యాయం చేయా లని కోరుతూ గత నెల రోజులుగా మహిళ పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతుంది. అయిన సరే నేటికి తన వద్ద ఇప్పటి వరకు ఫిర్యాదు తీసుకోలేదని భాదితరాలు సుజాత ఆవేదన చెందుతుందిఇ. నేను న్యాయం కోసం రోజులు తరబడి పోలీస్ స్టేషన్ చుట్టు తిరుగుతుంటే ... తన పిల్లలు ఆలాన పాలాన చూసే వారు లేక పిల్లలు చదువుకో లేక పోతున్నారని అందుకనే తానే ఉపాధ్యాయురాలై నా పిల్లలకు పోలీసు స్టేషన్లోనే చదువు చెప్పుకుంటున్నానని భాదితరాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. పోలీసులు ఇప్పటికైనా స్పందించి నాకు తగు న్యాయం చేయాలని ఆమె కోరుతుంది.

## డిగ్రీ కళాశాలలో

# మహిళా దినోత్సవం




నర్సీపట్నం : నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాలను నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రభావతి మాట్లాడుతూ అప్పట్లో మహిళలు ఓటు హక్కు, విద్య, ఉపాధి కోసం పోరాడి సాధించుకోవడం జరిగిందన్నారు. నాడు మహిళలుగా సాధించుకున్న హక్కులు ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. మహిళలు బ్రాండిక్స్, జీడిపిక్కలు, రొయ్యల ఫ్యాక్టరీలో అత్యధిక మంది పని చేస్తునప్పటికీ వారికి పనికి తగ్గ వేతనాలు ఇవ్వడం లేదన్నారు. లైంగిక వేధింపులకు గురవుతున్నా రక్షణ లేదన్నారు. స్త్రీలను వ్యాపార వస్తువు గానే చూస్తున్నారన్నారు. ఇందుకు సినిమా దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ తీసుకున్న జీఎస్టీ చిత్రం ఉదాహరణ అన్నారు. దీన్ని ప్రశ్నించిన మహిళా నాయకులపై అసభ్యకరంగా మాట్లాడిన వర్మపై పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరావు, శ్రీనివాసరావు, ఐద్వా డివిజన్ నాయకులు ఎల్.గౌరి, కోశాధికారి కెవి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల ఫంక్షన్ హాల్ ఫ్రీ
సెంట్రల్ ఏసీ
హోటల్ అరిటాకు పైన
ఎన్.ఏ.డి. జంక్షన్, వైజాగ్.
అతి తక్కువ రేట్లకే క్యాటరింగ్ & హాస్టల్స్
ఆఫీస్‌లకు ఫుడ్ సప్లయ్ హోటల్‌లో రూ. 79/-లకే
30 రకాల ఐటమ్స్‌తో విందు భోజనం
72889 99970

# బీపీ, షుగర్‌లను నిర్లక్ష్యం చేయొద్దు : రాధమ్మ



అమలాపురం : ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో గల వాసాలతిప్ప ఎంపియుపి స్కూల్ నందు గ్రామ పెద్ద రచ్చా సత్తిరాజు అధ్యక్షతన అమలాపురం నకు చెందిన ప్రముఖ సామాజికవేత్త శ్రీమతి బి.ఎస్.రాధమ్మ ఆధ్వర్యంలో డాక్టర్ కృష్ణప్రసాద్ ఎమర్జెన్సీ హాస్పటల్ బృందంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్తిరాజు మాట్లాడుతూ అందరూ తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలను పాటించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ముఖ్య అతిథి రాధమ్మ మాట్లాడుతూ బీపీ, షుగర్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పాము కాటుకు మంత్రాలు, నాటు వైద్యం పనికిరాదని వైద్యులను సంప్రదించాలని అన్నారు. అనంత రం వైద్య శిబిరానికి వచ్చిన 215 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందు లను పంపిణీ చేసారు. దీంతో పాటు కంటి పరీక్షలు కూడా చేసి మందులను అందజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యులు బొంతు వరప్రసాద్, స్కూల్ కమిటీ ఛైర్మన్ కర్రి వెంకటేశ్వరరావు, పట్టా గంగరాజు, కొల్లు ధనలక్ష్మి, వైద్యులు డాక్టర్ బడేటి నాగేశ్వరరావు, వరప్రసాద్, ఉమా కళ్యాణి, రాంజీ రెడ్డిబాబు, అంబటి సుజాత, సుమ, కాండ్రేగుల భాగ్యలక్ష్మి, హేమ, లాజర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాసం కల్పించడం హామీతో ఆక్రమణలు తొలగింపు



ఆలమూరు : మండల పరిధి చింతలూరులో జరిగే నూకాంబికా ఉత్సవాలకు భక్తులకు ఇబ్బంది కలుగకుండా వుండటానికి రాజమహేం ద్రవరం సబ్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ ఆదేశాలు మేరకు గత వారం రోజులుగా ఆక్రమణలు తొలగించడం జరుగుతోంది. ఇందులో భాగంగా చింతలూరు గ్రామంలోకి వెళ్లే రోడ్డు ప్రక్కన ఆక్రమణలో వున్న 11 గృహాలను రెవిన్యూ, పోలీసు, ఆర్ & బి అధికారుల బృందం జె.సి.బి.తో తొలగింపుకు సన్నతమవుతుండగా ఆక్రమణదారులు తమకు ఎన్నో ఏళ్లుగా నివాసం వుంటున్న తమకు పునరావాసం కల్పించాలని టెంట్‌వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనికి సర్పంచ్ గెద్దాడ వెంకట నారాయణమూర్తి సంఘీభావం తెలిపారు. అయితే తహశీల్దార్ కె.పద్మావతి మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఆక్రమణలు తొలగించవలసిందేనని ఉత్సవాలు అనంతరం అర్హులైన వారికి వేరేచోట ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ యిచ్చి బుధవారం ఆమె ఆధ్వర్యంలో సి.ఐ కె.లక్ష్మణరెడ్డి, ఎస్.ఐ. పి.దొరరాజు, ఆర్&బి జె.ఈ. ప్రసన్నకుమార్, ఆర్.ఐ. జానకిరాఘవల బృందం సిబ్బందితో తొలగింపులు చేసారు. దీంతో ఉభయ గోదావరి జిల్లాల నుండి నూకాంబికా ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా విశాలమైన రోడ్లు ఏర్పడటంపై సంబంధిత అధికారులందరినీ ప్రజలు అభినందించడం విశేషం.

## మహిళా మత్స్యకారులకు వృత్తి నైపుణ్యంపై శిక్షణా కార్యక్రమం

ఆలమూరు : మండల కేంద్రం ఆలమూరులోని మత్స్యకారుల కమ్యూనిటీ హాలు నందు ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం మహిళా మత్స్యకారులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించే శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యశాఖ అధికారి కె. సత్యనారాయణ ఆధ్వర్యంలో పచ్చళ్ల తయారీ నిపుణులు జి.ప్రసాద్ గారి ద్వారా రొయ్యలు, చేపలు, మెత్తళ్లు ద్వారా రుచికరమైన, ఆరోగ్యకరమైన నిల్వవుండే పచ్చళ్లు తయారుచేసే విధానాన్ని తెలియజేసారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం మహిళా మత్స్యకారులకు పచ్చళ్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బి.టి.ఎమ్. డాక్టర్ బాబు, ఎ.టి.ఎమ్. అరుణసాయి, ఎం.పి.ఎఫ్.ఓ హెలీనా, పంచాయితీ వార్డు మెంబరు కొపనాతి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# 16న వాహనాలు వేలం

కాకినాడ : పన్ను చెల్లించని మరియు రికార్డులు సక్రమంగాలేని వాహనాలపై క్రమరాహిత్యము లకు రవాణా శాఖ అధికారులు నిర్భందించిన వాహనాలు ఈనెల 16న ఉపరవాణా కార్యాల యంలో ఉదయం 11గంటలకు వేలం వేయడం జరుగుతుందని ప్రాంతీయ రవాణా అధికారి అశోక్ కుమార్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ నిబంధనలప్రకారం ఈవాహన యజమాని, ఫైనాన్స్ కంపెనీ వారికి నోటీసులు జారీ చేసినా స్పందించక పోవడంతో ఈ వాహనాలు వేలం వేయడం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొన దలచినవారు రెండురోజుల ముందుగా వాహనములను చూసుకొని వేలం జరుగు సమయంలో ముందుగా దరావత్తు సొమ్ము రూ.2200లు చెల్లించాలన్నారు. వేలంలో వాహనములు పొందినవారు సంబందిత జిఎస్‌టి టాక్స్‌చెల్లించాలని ఆశోక్‌కుమార్ తెలిపారు.

## ఈబీసి ఋణాలపై సర్వత్రా నిరసన

ఆలమూరు : మండలంలో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈ.బి.సి.వారికి) ఇచ్చే ఋణాలపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. వివరాలలోకి వెళితే ఈ ఋణాలు కొరకు మండల పరిధి 18 గ్రామాల నుండి 227 మంది అభ్యర్థిలు దరఖాస్తు చేసుకోగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించబడిన ఇంటర్వ్యూలకు 220 మంది వరకు హాజరయ్యారు. అయితే 18 గ్రామాలకు కేవలం 9యూనిట్లు మాత్రమే కేటాయించడంతో దరఖాస్తుదారులు సర్వత్రా నిరసనలు వ్యక్తం చేసారు. దీంతో సెలెక్షన్ కమిటీ గ్రామానికి ఒకటి చొప్పున అయినా ఇవ్వాలనే ఉద్దేశ్యంతో యూనిట్ 1 లక్ష రూపాయల ఋణాన్ని రూ.50వేలు చొప్పున గ్రామానికి -1 అందించటానికి నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యానాం : దరియాలతిప్ప రోడ్డుమార్గంలోని జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. గాజులూరు మండలం పెనుమళ్ళ గ్రామానికి చెందిన సోములు కిషోర్ (22) స్థానిక దొమ్మేటిపేటలోని రొయ్యల చెరువు వద్ద జరుగుతున్న పనులకు జెసిబి అసిస్టెంట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. యానాం నుండి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా కనకదుర్గా పరిశ్రమ రోడ్డులో ప్రమాదవశాత్తు బండిపై నుండి పడిపోయాడు తలకు తీవ్ర గాయాలు అవ్వడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ బడుగు కనకారావు తెలిపారు.

## సహకార సంఘాలకు జరిమానా

యానాం : బదలాయింపులకు పాల్పడిన పుదుచ్చేరిలోని కోపరేటివ్ సహకార సంఘాలకు ఆదాయపుపన్నుల శాఖ రూ. 50 లక్షల జరిమానా విధించింది. పుదుచ్చేరిలోని పాన్‌లైట్ సంస్థ డిమోనెట్రిజేషన్ సమయంలో నగదు బదిలిచేసిందని ఆదాయ పన్నుశాఖకు ఫిర్యాదు వెళ్ళాయి కేంద్ర ప్రభుత్వం, 500, 1000 రూపాయల పాతనోట్లను డిసెంబర్ లోగా మార్చుకోవాలని గడువు ఇచ్చిన విషయం తెలిసిందే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక మొత్తం పాతనోట్లను పాన్‌లైట్ ద్వారా మార్పిడిచేసుకున్న విషయాన్ని సిబిఐ ఇటీవల నిర్వహించిన దాడిలో నిర్ధారించింది. సిబిఐ ఇచ్చిన నివేదిక నేపథ్యంలో రూ. 50 లక్షల జరిమానా చెల్లించాలని సహకార శాఖకు ఆదాయపు పన్నులశాఖ తాఖీదులు పంపించింది. ఈ జరిమానా అధికారులు చెల్లిస్తారా లేక సహకార శాఖ మంత్రి చెల్లిస్తారా అన్నది ఇప్పుడు తేలవలసి ఉంది.

## పంచాయతీ కార్మికుల దీక్షలు

తాళ్ళరేవు : మండలంలోని పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ తాసల్దారు కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు. సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాసు, దూళిపూడి బాబి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జిఒ నెంబర్ 151 ప్రకారం జీతాలనుపెంచి ప్రభుత్వమే చెల్లించాలని గ్రామ కార్యదర్శుల పోస్టులలో అర్హులైనవారికి 30 శాతం కేటాయించాలని ఎన్ఎంఆర్ పార్టుటైమ్ ఫిక్సిడ్ పేతో సహా ఒప్పంద కార్మికులందర్ని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఏకరూపు దుస్తులు, గుర్తింపుకార్డులు, పిఎఫ్ బీమా ప్రమాద పించును, గ్రాడ్యూటి భద్రతా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. లక్ష్మీనరసింహరాజు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టి. ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు తరలివెళ్ళిన జనసేన కార్యకర్తలు



పిఠాపురం : తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం నుంచి గుంటూరులో జరుగుతున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభకు పిఠాపురం నియోజక వర్గ నాయకుడు ఎం.జగదీష్ చంద్రవాసు ఆధ్వర్యంలో భారీగా జనసేన కార్యకర్తలు తరలి వెళ్ళారు. జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సభ విజయవంతంగా సాగాలని పిఠాపురం నియోజక వర్గ నాయకుడు ఎం.జగదీష్ చంద్రవాసు పాదగయలోని కుక్కుటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పెట్టిన మీటింగ్‌కు పిఠాపురం నియోజకవర్గం నుండి ఐదు బస్సులు, పది కార్లలో వెళ్ళడం జరుగుతుందని వెళ్ళే వాళ్ళకు జాగ్రత్తలు, తగు సూచనలు చేశామన్నా రు. అలాగే ఈ సభకి రాష్ట్రం నలుమూలలు నుండి, తెలంగాణ నుండి కూడా అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని, సభ విజయవంతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

# నేరస్థులకు అరదండాలు

### రూ.10 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



కాకినాడ : ఉభయ గోదావరి జిల్లాల్లో వరుస దొంగతనాలతో ప్రజలను భయభ్రాంతులను చేస్తూ పోలీసులను ముప్ప తిప్పలు పెడుతూ పరుగులు తీస్తున్న నేరగాళ్ళకు ఎట్టకేలకు అరదండాలు పడ్డాయి.తూర్పుగోదావరిజిల్లా, పశ్చిమగోదావరిజిల్లా పోలీసులు ఏక కాలంలో పెట్టిన నిఘా ఫలించింది.తూర్పుగోదావరిజిల్లా పోలీసులు అత్యంత కీలకమైన సమాచారాన్ని అందుకొని పలు కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నఇద్దరు నేరస్దులను అరెస్టు చేసారు.ఈ వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలోక్రైం డిఎస్పీ.ఎ పల్లపురాజు వెల్లడించారు.పశ్చిమగోదావరిజిల్లా ఏలూరులోని తూర్పు వీధిలో నివసించే గొల్లపల్లి వరప్రసాద్ కుమారుడు నాగమల్లేశ్వరరావు (38), గొన్నాబత్తుల సాయి మోహనరావు కుమారుడు కార్తీక్ కుమార్ (30)అనే ముద్దాయిలను కాకినాడ జ్యోతుల మార్కెట్‌లో ఒక లాడ్జిలో క్రైం పోలీసులు అరెస్టు చేసారు. ముద్దాయిల నుంచి రూ.10లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అందులో సుమారు 330 గ్రాముల బంగారు వస్తువులు,1150 గ్రాముల వెండి వస్తువులు ఒక ఎల్‌యిడి టిపి, 80 సర్జికల్ బ్లేడ్లు,రూ.15 వేలు నగదు ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందుతులపై ఐపిసి457,380సెక్షన్‌లకింద కేసు నమోదు చేసారు.ముద్దాయిలిద్దరూ జంటగా ఇళ్ళ తాళాలు పగులగొట్టి ఇళ్ళను దోచుకోవడంలో సిద్ధహస్తు లు. సుమారు 17 కేసులు ఏలూరు, భీమడోలో ,ఉండ్రాజవరంలో ఉన్నాయి. సబ్ జైల్ నుంచి బయటపడిన నాగమల్లేశ్వరరావు తన అలవాట్లు మార్చు కోలేదు. తూర్పు, పశ్చిమ ,కృష్ణా జిలాల్లలోని కాకినాడ, ఏలూరు, ఉంగుటూరు ప్రాంతాలలో ఇంటి తాళాలు బద్ధలుకొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. నగదుతోపాటు వెండి బంగారు వస్తువుల పైనే వీరు దృష్టిని కేంద్రీకరించి దొంగతనాలు చేయడం వీరి ప్రత్యేకత. విశాఖపట్టణంలో అయితే మూడు మర్డర్ ఫర్ గెయిన్స్ కేసులు గొల్లపల్లిపై ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టూటౌన్ క్రైం ఎస్సై.ఎం. పాపరాజు,, ఎస్సై జిహెచ్ .సుధాకర్, జి.హరీష్‌కుమార్, హెచ్‌సి గోవిందు,పిసీలు చిన్న,శ్రీరాం,వర్మ ,అజయ్, బాబు తదితరులు ఉన్నారు.

# గోమాతా..... మన్నించు

**- రాత్రి వేళలో అక్రమంగా గోవులు, మాంసం తరలింపు**

**- అవే వాహనాలలో గంజాయి తరలిస్తున్నట్లు అనుమానం - భయాందోళనలో ప్రజలు**



పిఠాపురం : బైపాస్ కేంద్రంగా పలు గ్రామాలు అడ్డాగా వందల కొలది గోవులను, టన్నుల కొలది గోమాంసాన్ని లారీల్లో తరలించుకు పోతున్నారు అక్రమార్కులు. హిందువులు పరమ పవిత్రంగా భావించి కొలిచే గోవులను కళ్లెదుటే తరలించుకుపోతున్నారని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కత్తిపూడి బైపాస్ కేంద్రంగా రాత్రి వేళల్లో పుంత రోడ్లు మరియు గొల్లప్రోలు గ్రామాలలోని ఇళ్ళ మద్య నుండి భారీ వాహనాలు, స్పీడుతో పరుగులు పెడుతున్నాయని, రాత్రి వేళలో ఇళ్ళ నుంచి బయటకు రావడానికి, గ్రామప్రజలు వారి పొలాల్లోకి నీరు పెట్టుకోవడానికి రైతులు బిక్కు బిక్కుమంటూ వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడిందని పలువురు తెలుపుతున్నారు. ఇంత జరుగు తున్నా సంబంధిత శాఖాధికారులు నోరు మెదపక పోవడంపై పలువురు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా వాహనాలు పలు గ్రామాల గుండా వచ్చి బాక్సుల వంటివి దించి కారుల్లో ఎక్కిస్తున్నారని స్తానికులు తెలుపుతున్నారు. ఇలాంటి సంఘటనలు రాత్రి సమయాల్లో నిత్యకృత్యంగా మారడంపై పలు గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నామని తెలిపారు. ఈ విషయాలను స్థానికంగా ఉన్న కొంతమంది విలేకర్ల దృష్టికి రాగా సాక్ష్యాదారాలు సేకరించేందుకు వారు ప్రయత్నిస్తుంటే, వారిపైనే తప్పుడు ప్రచారాలకు పూనుకుంటున్నారని రాత్రి వేళల్లో ఇటువంటి సంఘటనలు ప్రజాస్వేచ్ఛను దెబ్బతీస్తాయని, ఇలానే కొనసాగితే ఈ అక్రమ వ్యాపారంలో భాగంగా ఉన్న ప్రతి ఒక్కరిని బయటికి తెస్తామని, ఈ సంఘటనపై పై అధికారులకు కూడా ఫిర్యాదులు చేస్తామని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, గ్రామవాసులు, రైతులు తెలిపారు.

# సోమువీర్రాజుపై వర్మ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

**- పిఠాపురం ఎమ్మెల్యే వర్మ సవాలును స్వీకరిస్తున్నాం - బహిరంగ చర్చకు బిజెపి సిద్ధం**

**భాజాపా జిల్లా అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాలకొండయ్య**



పిఠాపురం : తెలుగుదేశం ఎమ్మెల్యే ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎనిమిరెడ్డి మాల కొండయ్య డిమాండ్ చేశారు. బిజెపి పిఠాపురం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న సోము వీర్రాజుపై వర్మ ఇష్టానుసారం మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఒకర్ని విమర్శించే ముందు ముందు వర్మ తన స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. తొలుత ప్యాకేజీకి కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకుని ప్యాకేజీతో హోదాకన్నా ఎక్కువ అభివృద్ధి చేసుకున్న మాట వాస్తవమా..? కాదా అని ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘంలో కాంగ్రెస్, తెలుగుదేశం, వామపక్షాలు తదితర పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్నట్లు వీరు ప్రత్యేకహోదా పై చర్చించి ప్రత్యేకహోదా వల్ల అభివృద్ధి ఆలస్యమవుతుందని, ప్రత్యేకహోదాను రద్దుచేసారని పేర్కొన్నారు. ఇప్పుడు ఏమీ తెలియనట్లు భాజాపాపై నిందలువేయడం సరికాదన్నారు. ఆ సమావేశంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతారా అని ప్రశ్నించారు. ఇక్కడున్న ఎమ్మెల్యేకి ఆ విషయం తెలియదా అని సూటిగా ప్రశ్నించారు. కేంద్ర మంత్రులకి, పార్లమెంట్ సభ్యులకు తెలియదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ఎన్నికలకు మునుపు అనేక వాగ్ధానాలు చేసి అధికారంలోకి వచ్చారని ఇప్పటి వరకూ వేటినీ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయారని ఆరోపించారు. బాబు వస్తే జాబు వస్తుందని నిరుద్యోగ యువతకు ఆశలు కలిపించడం వాస్తవంకాదా అని ప్రశ్నించారు. ఉపాధిహామీ నిధులు ఆగిపోవడానికి తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే కారణమన్నారు. నిధులు ప్రక్కదారి పట్టడంతో నిలిచిపోయాయన్నారు. పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్రం పూర్తి చేసేందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో ముంపు మండలాలను ఎపిలో కలిపిన ఘనత బిజెపిదేనన్నారు. ఆ విధంగా పోలవరం ముంపు మండలాల సమస్యలేకుండా ముందుచూపుతో వ్యవహరించినట్లు పేర్కొన్నారు. పోలవరం పై అనవసర ఆందోళన అవసరంలేదన్నారు. పోలవరంను పూర్తి చేసేందుకు బిజెపి చిత్తశుద్ధితో కృషిచేస్తుందన్నారు. తెలుగుదేశం పోలవరం నిధులను ఎత్తిపోతల పథకాలకు వాడుకుందని ఆరోపించారు. తద్వారా పోలవరం జాప్యానికి పరోక్షంగా కారణమైందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వర్మ సుద్దగడ్డవాగుకు నిధులు బడ్జెట్‌లో ఎందుకు సాధించలేకపోయారని ప్రశ్నించారు. వర్మ ఎమ్మెల్యేగా గెలిచిన సంవత్సరంలో అక్కడ సుద్దగడ్డ వాగు ముంపు బాధితులు వార్షికోత్సవం బ్యానర్స్ ప్రదర్శించిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో బ్రతికునటువంటి వ్యక్తులని చనిపోయినట్లుగా చూపించి ఫించన్లు మంజూరుచేసిన ఘనత తెలుగుదేశానికే దక్కుతుందని దీనిపై చర్చించాలన్నారు. ఎమ్మెల్యే వర్మ సవాలును స్వీకరిస్తున్నామని చర్చకు తాము సిద్ధమని ఆయన ప్రకటించారు. ఈ సమావేంలో పార్టీ నాయకులు బుర్రి మురళీధరరావు, పసుపులేటి సత్యనారాయణ, ఈగల కొండబాబు, డి.వి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను

## చెర్రీ బాటలో నారా రోహిత్.. మరో ప్రయోగం

రొటీన్ కథలకు భిన్నంగా వైవిధ్యభరిత కథలను ఎన్నుకుంటూ తనకంటూ టాలీవుడ్‌లో ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు నారా రోహిత్. అయితే ఈ మధ్యకాలంలో కమర్షియల్ సినిమాలవైపు మొగ్గు చూపడంతో వరుస పరాజయాలను ఎదుర్కొంటున్నాడు. దీంతో తన పాతపంథాలో వైవిధ్యకథల-తో ప్రేక్షకులను మెప్పించేందుకు రెడీ అయ్యారు నారా రోహిత్. ఉగాది కానుకగా లాంచ్ కాబోతున్న ఈ మూవీ నారా రోహిత్ కెరియర్‌లో 18వ చిత్రం. ఈ మూవీలో నారా రోహిత్ మాటలు రాని వ్యక్తిగా కనిపిస్తున్నట్టు వరల్డ్ ఆఫ్ ది వర్డ్ లెస్ అనే ప్రమోషన్ క్యాప్షన్‌ని బట్టి తెలుస్తోంది. సినిమా మొత్తంలో నారా రోహిత్‌కి ఒక్కడైలాగ్ కూడా లేకుండా కేవలం హావభావాలతోటే కథను నడిపించే పెద్ద ప్రయోగం చేస్తున్నారు.

తాజాగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న రంగస్థలం మూవీలో రామ్ చరణ్.. మాటలు వినిపించని (చెవుడు) చిట్టిబాబు క్యారెక్టర్‌లో నటించి.. ఇప్పటికే విడుదలైన టీజర్‌లో మెప్పించగా.. నారా రోహిత్ ఇదే తరహాలో మాటలు రాని(మూగ) పాత్రలో నటించేందుకు రెడీ అయ్యారు. శ్రీవైష్ణవి



క్రియేషన్స్ బ్యానర్‌పై నారాయణరావు అట్లూరి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ప్రస్తుతం నారా రోహిత్.. వీరభోగ వసంత రాయ, పండగాలా వచ్చాడు, ఆటనాదే వేటా నాదే చిత్రాలు సెట్ మీద ఉన్నాయి.

## జేడీ చక్రవర్తి ఉగ్రం.. లుక్ అదిరింది



చాలా కాలం తరవాత జేడీ చక్రవర్తి హీరోగా నటించిన తెలుగు చిత్రం వస్తోంది. ఈ మధ్య కాలంలో ఆయన చాలా తెలుగు సినిమాలు చేసినప్పటికీ అన్నీ ప్రత్యేక పాత్రలే. అయితే ఇప్పుడు పూర్తిస్థాయి హీరో పాత్రలో వస్తున్నారు. ఆ చిత్రమే ఉగ్రం. అమ్మ రాజశేఖర్ దర్శకుడు. ఖాసిం సమర్పణలో నక్షత్ర మీడియా పతాకంపై నక్షత్ర రాజశేఖర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. ఉగాది పర్వదినాన ఉగ్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నారు. వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయటానికి సన్నాహాలు జరుగుతున్నాయని నిర్మాత రాజశేఖర్ తెలిపారు.

జేడీ చక్రవర్తి కెరీర్‌లో ఉగ్రం ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని నిర్మాత ధీమా వ్యక్తం చేశారు. యువతను విపరీతంగా ఆకట్టుకునేలా ఉగ్రం ఉంటుందని చెప్పారు. యాక్షన్, నేపథ్య సంగీతానికి మంచి స్కోప్ ఉన్న చిత్రమిదని తెలిపారు. ఈ చిత్రాన్ని మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు అమ్మ రాజశేఖర్ తెరకెక్కించారని, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ చిత్రంలో జేడీ చక్రవర్తితోపాటు అక్షిత, మనోజ్ నందం, అక్షత, బెనర్జీ, ఆర్.పి., ఛమ్మక్ చంద్ర, శ్రీరామ్ చంద్ర, టార్జాన్, సంపూర్ణేష్ బాబు, షానీ, రాజు భాయ్ తదితరులు నటించారు. జాన్ భూషన్ సంగీతం సమకూర్చగా.. చిన్నా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు.

## కాలుతో రుద్దిన ఆ స్టార్ హీరో చెంప పగలకొట్టా : రాధికా ఆప్టే



ఎప్పుడూ ఏదోఒక విషయంతో సంచలనంగా మారే రాధికా ఆప్టే.. తాజాగా దక్షిణాది సినీ పరిశ్రమలోని ఓ హీరోపై సంచలన కామెంట్స్ చేసి మరోసారి వార్తల్లో నిలిచింది. బాలీవుడ్ నటి నేహా దూపియా నిర్వహిస్తున్న ఓ టాక్ షో కు ముఖ్య అతిథిగా వచ్చిన రాధికా ఆప్టే.. తన కెరీర్ ప్రారంభంలో జరిగిన ఓ సంఘటన చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచింది.

దక్షిణాదిలో నా మొదటి సినిమా షుటింగ్ జరుగుతున్నపుడు మొదటిరోజే ఓ స్టార్ హీరో నాతో అనుచితంగా ప్రవర్తించాడు. అప్పటిదాకా కనీసం పరిచయం కూడా లేని ఆ హీరో.. సెట్స్‌లో నా పక్కన కూర్చొని అసభ్యంగా కాలుతో రుద్దాడు. వెంటనే కోపంతో అతని చెంప చెళ్లుమనిపించా.. అంటూ సదురు హీరోపై సంచలన ఆరోపణలు చేసింది రాధికా. సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ పేరుతో మహిళలను లొంగదీసుకుంటున్నారని పలువురు హీరోయిన్స్ నోరువిప్పుతున్న తాజా తరుణంలో రాధికా ఆప్టే చెప్పిన ఈ విషయం సినీ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

బాలీవుడ్‌లో పలు సినిమాలు చేసిన రాధికకు తెలుగులో లెజండ్, లయన్, రక్త చరిత్ర లాంటి సినిమాలు, తమిళంలో 'కబాలి' సినిమా చెప్పుకోదగ్గ సినిమాలు.

## వెంకీ సరసన?

అమలాపాల్ తెలుగులో యువ కథానాయకులు సరసన మెరిసింది. అల్లు అర్జున్, రామ్‌చరణ్, నాగచైతన్య, నాని తదితరులతో కలిసి ఆడిపాడింది. అయితే ఆ సినిమాలు ఆమెకి పెద్దగా కలిసిరాకపోవడంతో తమిళంలోనే సినిమాలు చేస్తూ బిజీ అయిపోయింది. కొంతకాలంగా మళ్లీ తెలుగులో సినిమాలు చేయాలని ఆమె ప్రయత్నాలు చేస్తోంది.

అయితే ఈసారి యువ కథానాయకుల సరసన కాకుండా, అగ్ర కథానాయకులతో కలిసి నటించేందుకు ఒప్పుకొన్నట్టు తెలుస్తోంది. వెంకటేష్ సరసన అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న ఎఫ్2లో అమలాపాల్ కథానాయికగా ఎంపికైనట్టు సమాచారం. అలాగే నాగార్జున, నాని కలిసి నటిస్తున్న సినిమాలోనూ అమలాపాల్ నటించబోతున్నట్టు ప్రచారం సాగుతోంది. ఆ రెండు చిత్రాలు క్రేజీ కాంబినేషన్‌తో రూపుదిద్దుకొంటున్నవే కాబట్టి అమలాపాల్ మంచి అవకాశాల్నే ఒడిసి పట్టిందని పరిశ్రమ వర్గాలు మాట్లాడుకొంటున్నాయి.

## గుండెపోటుతో ఛత్రపతి విలన్ కన్నుమూత
## సాహోలో నటించాల్సి ఉందట!



ముంబయి: బాలీవుడ్ నటుడు నరేంద్ర ఝా (55) కన్నుమూశారు. గుండెపోటుతో బుధవారం ఉదయం 5 గంటలకు ముంబయిలోని తన ఫాం హౌస్‌లో ఆయన తుదిశ్వాస విడిచారు. ఇప్పటికే ఆయన రెండుసార్లు గుండెపోటుకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కోకిలాబెన్ అంబానీ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఉన్నారు. మూడోసారి గుండెపోటు రావడంతో దురదృష్టవశాత్తు ఆయన మృతి చెందారు.

నరేంద్ర ఝా తెలుగులో ఛత్రపతి, యమదొంగ, లెజెండ్ సినిమాల్లో విలన్. అనేక హిందీ చిత్రాల్లో, టీవీ షోలలో కూడా నటించారు. మొహెంజదారో, హమారీ అధూరి కహానీ, ఘాయల్ వన్స్ అగైన్, ఫోర్స్ 2, రయీస్, కాబిల్ తదితర చిత్రాల్లో ఆయన ప్రధాన పాత్రలు పోషించారు. ప్రభాస్ హీరోగా నటిస్తున్న సాహోలోనూ నరేంద్ర ఝా నటించాల్సి ఉందట.

నరేంద్ర ఝా మృతి పట్ల పలువురు బాలీవుడ్ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోనూసూద్, అశోక్ పండిత్ తదితరులు ట్వీట్లు చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఈయన అత్యంత సంపన్న ఎంపీ.. ఆస్తి రూ.4వేలకోట్లు

పట్నా: రూ.4వేల కోట్ల ఆస్తితో దేశంలోనే అత్యంత సంపన్న ఎంపీగా బిహార్‌కు చెందిన మహేంద్ర ప్రసాద్ అలియాస్ కింగ్ మహేంద్ర నిలవనున్నారు. ఎన్నికల నామినేషన్ పత్రంలో రూ.వెయ్యి కోట్ల ఆస్తులు ప్రకటించడంతో జయాబచ్చన్ అత్యంత సంపన్న నేతగా నిలవనున్నారని నిన్నటివరకూ అనుకున్నాం. అయితే కింగ్ మహేంద్ర రూ.4వేల కోట్ల ఆస్తులు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. బిహార్‌లో రాజ్య సభకు జేడీయూ అభ్యర్థిగా ఆయన నామినేషన్ దాఖలు చేశారు. అందులో రూ.4వేల కోట్ల ఆస్తులను ప్రకటించారు. దీంతో మహేంద్ర దేశంలో అత్యంత సంపన్న ఎంపీ కానున్నారు. ఆయన ఏడోసారి పార్లమెంటులో ప్రవేశించేందుకు సిద్ధమయ్యారు. జేడీయూ నుంచి పోటీ చేయడం ఇది మూడోసారి.

ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో చరాస్తులు రూ.4,010.21కోట్లుగా, స్థిరాస్తులను రూ.29.1కోట్లుగా ప్రకటించారు. డా. మహేంద్ర ప్రసాద్‌కు రెండు ఫార్మా కంపెనీలు ఉన్నాయి. మాప్రా లాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్, అరిస్టో ఫార్మాస్యుటికల్స్. వీటికి సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో టర్మ్ డిపాజిట్లు రూ.2,239కోట్లు ఉన్నట్లు తెలిపారు. ఇంతటి సంపన్న వ్యక్తి అయిన మహేంద్ర పేరుమీద వాహనాలు గానీ బీమా పాలసీలు గానీ ఏవీ లేకపోవడం గమనార్హం. రూ.41లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఆదాయపన్ను రిటర్న్లులో ఆయన 2016-17 ఆర్థిక సంవత్సరానికి తన ఆదాయాన్ని రూ.303.5కోట్లుగా ప్రకటించారు.

మహేంద్ర తొలిసారిగా 1980లో పార్లమెంటులో అడుగుపెట్టారు. కాంగ్రెస్ నుంచి జెహానాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మొదటిసారి గెలుపొందారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయారు. దీంతో 1985లో కాంగ్రెస్ ఆయనకు రాజ్యసభ టికెట్ ఇచ్చింది. అప్పటి నుంచి కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీయూల నుంచి పోటీ చేసి ఆయన రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా ఆయనకు అత్యధిక దేశాలు పర్యటించిన ఎంపీగా కూడా పేరు ఉంది. ఆయన మొత్తం 211 దేశాలు సందర్శించారు.

ఆయన దాదాపు 53సార్లు యూకే పర్యటనకు వెళ్లారు. పది సార్లు అమెరికా పర్యటనకు వెళ్లారు. 2002 ఏప్రిల్ 9 నుంచి 2003 ఏప్రిల్ 8 వరకు ఒక ఏడాదిలో ఆయన ఏకంగా 84 దేశాలు చుట్టివచ్చారు.

## దాణా కుంభకోణం నాలుగో కేసులో తీర్పు రేపే

రాంచీ : రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌పై మరో కేసులో తీర్పు గురువారం రాబోతోంది. స్పెషల్ సీబీఐ కోర్టు దాణా కుంభకోణంలోని నాలుగో కేసులో తీర్పు చెప్పబోతోంది. 1995 డిసెంబరు నుంచి 1996 జనవరి మధ్యలో డుమ్‌కా ట్రెజరీ నుంచి రూ.3.13 కోట్లు మోసపూరితంగా ఉపసంహరించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. ఈ కేసులో విచారణ ఈ నెల 5న ముగిసింది. ఈ కేసులో లాలూ ప్రసాద్ యాదవ్‌తోపాటు బిహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా, మరో 30 మంది నిందితులు. దాణా కుంభకోణం కేసుల్లోని మొదటి కేసులో తీర్పు 2013లో వెలువడింది. లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఐదేళ్ళ జైలు శిక్ష విధించారు. 2017 డిసెంబరు 23న రెండో కేసులో తీర్పు వెలువడింది. దీనిలో లాలూకు మూడున్నరేళ్ళ జైలు శిక్ష విధించారు. మూడో కేసులో తీర్పు ఈ ఏడాది జనవరి 24న వెలువడింది. దీనిలో ఆయనకు ఐదేళ్ళ జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ సీబీఐ కోర్టు తీర్పు చెప్పింది.

## ఆగస్ట్ 14న జనసేన మేనిఫెస్టో: పవన్

అమరావతి: ఆగస్టు 14న జనసేన మేనిఫెస్టో విడుదల చేస్తామని జనసేన అదినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. మేనిఫెస్టో ఎలా ఉండనుందో కూడా క్లుప్తంగా పవన్ వివరించారు. 33 వెనకబడిన కులాలకు అండగా ఉండేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఎస్సీలు పారిశ్రామికవేత్తలుగా మారేలా చర్యలు చేపడతామన్నారు. మహిళలకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. నేతలు కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని.. ఇదే పాలనా విజ్ఞతా అని ప్రశ్నించారు. కాపు కులాలకు, బీసీలకు మధ్య తగాదా పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘంలో అసమానతలు వస్తున్నాయి అన్నారు. ఉన్నతమైన వ్యక్తిత్వం.. ఉన్నతమైన ఆశయాలు కావాలన్నారు. జనసేన ఎవరినీ మభ్య పెట్టదన్నారు. ఆర్థిక, ఉద్యోగ భద్రత కల్పిస్తే సరిపోతుందని తెలిపారు. మిగతావి రాజ్యాంగ పరిధిలో జరగాలన్నారు. అంబేద్కర్ చెప్పినట్టు కులనిర్మూల చెయ్యగలమో లేదో తెలియదు కానీ.. కులాల మధ్య ఐక్యత తీసుకువస్తామన్నారు. ముస్లింలకు అండగా ఉంటానన్నారు.

# ప్రజా సేవ మరిచి
# సొంత వ్యాపారాలకే పరిమితమౌతున్నారు

- టీడీపీ ఎంపీలు చిత్తశుద్ధితో లేరు
- రాజీవ్, వైఎస్సార్ మహా నాయకులు
- వైఎస్సార్ హయాంలో పార్టీలకతీతంగా సేవలందించేవారు
- బాబు పాలనలో పచ్చ చొక్కాలకే అందలం
- విశాఖ రైల్వే జోన్ మూడు దశాబ్దాల కల
- పచ్చ ఎంపీల దొంగ దీక్షలతో ప్రత్యేక హెూదా రాదు - వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త సత్తి రామకృష్ణా రెడ్డి

విశాఖపట్నం : ఎన్నికల్లో పోటీ చేసేందుకు స్వలాభాలు మరిచి ప్రజా సేవకే అంకితమౌతామని ప్రల్భాలు పలికి, పదవిని అలంకరించిన తరువాత ప్రజలను మరిచి స్వలాభాపేక్షతో పాలన సాగిస్తున్న ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం ఎంపీల తీరును ప్రతి ఒక్క తెలుగువాడు అసహ్యించుకునే రీతిలో ఉందని, ప్రజా సేవ మరిచి సొంత వ్యాపారాలకే పరిమితమౌతున్న టీడీపీ ఎంపీలకు రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెపుతారని వైకాపా ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త సత్తి రామకృష్ణా రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు గాని, ఆ పార్టీ ఎంపీలకు గానీ చిత్తశుద్ధి లేదని రామకృష్ణా రెడ్డి దుయ్యబట్టారు. గడచిన నాలుగు సంవత్సరాలుగా దొంగ నాటకాలతో ప్రజను వమ్మించి తమ సొంత వ్యాపారాలు, కాంట్రాక్టులు చేసుకుంటూ అవినీతి మయంలో కూరుకుపోయిన టీడీపీ ఎంపీలు చివరి నిముషంలో దొంగ దీక్షలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మిత్రపక్షంగా ఉండి రాష్ట్రానికి రావలసిన కనీస అవసరాలను కూడా



రాబట్టుకోలేని అసమర్ధ ప్రభుత్వమని అన్నారు. తమ నాయకుడు ఓటుకు నోటు కేసులో అడ్డంగా బుక్కయి ఢిల్లీ పెద్దలకు భయపడతుంటే ఎంపీలు మాత్రం ఢిల్లీ పెద్దలపై ధర్నాలు చేయడం హాస్యాస్పదమన్నారు.

దివంగత రాజీవ్, వైఎస్సార్, హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరూ లబ్ధిపొందారని ఆయన తెలియజేశారు. కానీ నేడు తెలుగుదేశం పాలనలో ప్రాంతాల వారీగా, జాతుల వారీగా, కుల మతాల వారీగా పచ్చచొక్కాల వారికే సంక్షేమ పథకాలు అందిస్తూ సామాన్య మానవులను అణదదొక్కే విధంగా రాక్షస పాలన సాగిస్తున్నారని అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఓ మంచి కాలిక్యులేటర్, మానిప్యులేటర్ అని, ప్రతీ పనికి లెక్క కడుతూ ప్రజలను ఊహా ప్రపంచం వైపు నడిపిస్తూ లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ఆయన బాటలోనే పయనిస్తున్న టీడీపీ మంత్రి వర్గం, ఎమ్మెల్యేలు వారి వారి స్థాయిలలో అవినీతికి అలవాటుపడి రాష్ట్రాన్ని మాఫియా హబ్‌గా మార్చారని దుయ్యబట్టారు. రెండెకరాల చంద్రబాబు నాయుడుకి నేడు లక్షల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. విశాఖ రైల్వే జోన్ 3 దశాబ్దాల కల అని అన్నారు. రైల్వే జోన్ వస్తే ఉత్తరాంధ్ర యవతరానికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయి పేర్కొన్నారు.

### వరుసగా మూడో నెల తగ్గిన
## టోకు ద్రవ్యోల్బణం

దిల్లీ: ఆహార వస్తువల ధరలు తగ్గడంతో వరుసగా మూడో నెల టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం తగ్గింది. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఫిబ్రవరి నెలలో టోకు ద్రవ్యోల్బణం 2.48శాతంగా నమోదైంది. జనవరి నెలలో ఈ ద్రవ్యోల్బణం 2.84శాతంగా నమోదైన విషయం తెలిసిందే. 2017 జులై తర్వాత ఇంత శాతం తగ్గడం ఇదే. 2017 డిసెంబరులో 3.58శాతంగా ఉండగా.. 2018 జనవరిలో 2.84శాతంగా ఉంది.

ఇక ఇంధనం, విద్యుత్ టోకు ద్రవ్యోల్బణం జనవరిలో 4.08శాతం ఉండగా.. అది ఫిబ్రవరి నెలలో తగ్గి 3.81శాతాన్ని నమోదు చేసుకుంది. ఇక డబ్ల్యూపీఐ ఉత్పాదక ఉత్పత్తుల ద్రవ్యోల్బణం జనవరిలో 2.78శాతం ఉండగా.. గత నెలలో 3.04శాతం నమోదయ్యింది.

## రష్యాకి బ్రిటన్ బిగ్ షాక్

లండన్ : ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత మొట్టమొదటిసారి రష్యాపై బ్రిటన్ విరుచుకుపడింది. బ్రిటన్ ప్రధాన మంత్రి థెరెసా మే బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. 23 మంది రష్యా దౌత్యవేత్తలను బహిష్కరించారు. ఈ స్థాయిలో దౌత్యవేత్తలను బహిష్కరించడం 30 ఏళ్ళ తర్వాత ఇదే తొలిసారి. ఈ ఏడాది రష్యాలో జరిగే సాకర్ వరల్డ్ కప్‌కు బ్రిటన్ ప్రభుత్వ అధికార ప్రతినిధిని పంపబోమని ప్రకటించారు.

థెరెసా మే నిర్ణయాల నేపథ్యంలో బ్రిటన్, రష్యా మధ్య సంబంధాలు దారుణంగా క్షీణిస్తున్న విషయం సుస్పష్టమవుతోంది.

రష్యా మాజీ గూఢచారి సెర్గీ స్క్రైపాల్ బ్రిటన్కు డబుల్ ఏజెంట్‌గా మారారు. ఆయనతోపాటు ఆయన కుమార్తెపై ఇటీవల నెర్వ్ ఏజెంట్ ఎటాక్ జరిగింది. వీరిద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. వీరికి ప్రస్తుతం చికిత్స జరుగుతోంది. వీరిపై దాడి వెనుక రష్యా ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని థెరెసా మే ఆరోపించారు. అప్పటి నుంచి ఈ రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

# ప్రజలే మనకు ప్రతిపక్షం : ఎమ్మెల్యేలతో సీఎం

అమరావతి: సీఎం చంద్రబాబు నివాసంలో తెదేపా సమన్వయ కమిటీ సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీ, బిహార్‌లో లోక్‌సభ స్థానాల ఉప ఎన్నిక ఫలితాలతో పాటు వైకాపా వ్యవహార శైలి, విభజన హామీలు నెరవేర్చడంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరు, తదితర అంశాలపై చర్చించనున్నారు. యూపీ, బిహార్ లోక్‌సభ ఉప ఎన్నికల ఫలితాలను సీఎం నేతలను అడిగి తెలుసుకున్నట్టుగా సమాచారం. వివిధ రౌండ్లలో ఆయా పార్టీలకు వస్తోన్న ఓట్ల సరళిని అడిగి తెలుసుకున్న సీఎం.. వాటిని నిశితంగా పరిశీలించినట్టు తెలుస్తోంది. దేశంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయని నేతలతో ఆయన అన్నట్టు సమాచారం.

పార్లమెంట్‌లో చర్చలు సరిగ్గా జరగని తీరు, తెలంగాణ అసెంబ్లీలో చోటుచేసుకున్న గందరగోళం, ఏపీలో ప్రతిపక్షం సభలకు గైర్హాజరవుతున్న విషయాలను ఆయన ఈ సమావేశంలో ప్రస్తావించినట్టు సమాచారం. ఈ తరుణంలో తెదేపాపై మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ ప్రజాప్రతినిధులంతా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రతిపక్షం సభలో లేకపోయినా ప్రజలే మనకు ప్రతిపక్షంగా భావించి సమర్థంగా అన్ని అంశాలను చర్చించాలని, అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని నేతలకు దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. ప్రతిఒక్కరూ ఆత్మావలోకనం చేసుకొని తప్పొప్పుల్ని బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలు, ప్రత్యర్థుల బలహీనతలపైనా దృష్టిపెట్టాలని దిశానిర్దేశం చేశారు.





తేది 14-3-2018 నాడు అనగా బుధవారం ఉదయం 10 :00 గంటలకు 37 వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంకల అప్పారావు గారి అద్వర్యంలో వార్డు తెలుగుదేశం పార్టీ ఆమ్వేసం జరిగినది. ఈ కార్యక్రమానికి వార్డ్ తెలుగుదేశం పార్టీ కోఆప్షన్ సభ్యులు , బీసీ సెల్ ఎస్సీ సెల్, మైనారిటీ సెల్ , మహిళా ,యువత కమిటీల సభ్యులు హాజరైనారు . ఈ కార్యక్రమంలో ముందుగా స్వర్గీయ అన్న శ్రీ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు . అనంతరం ఎజెండా అంశాలపై వార్డు అధ్యక్షుడు కమిటీ సభ్యులతో చర్చించారు .
ఏ జెండా : 1 . ప్రత్యేక హోదా గురించి చర్చ
2 .రైల్వే జోన్ గురించి చర్చ, 3 . వార్డు లో గల సమస్యలపై చర్చ
4 . వార్డు అధ్యక్షుడు అనుమతి తో ఇతర విషయాల పై చర్చలు

## ద్రవిడ్, సైనా సహా మోసపోయిన క్రీడాకారులు

బెంగళూరు: టీమిండియా అడ్డుగోడ, మిస్టర్ డిపెండబుల్ రాహుల్ ద్రవిడ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, ప్రకాశ్ పదుకొణె సహా చాలా మంది క్రీడాకారులు, ప్రముఖులు ఓ కంపెనీ చేతిలో మోసపోయారని సమాచారం. ఒక పోంజీ పథకంలో పెట్టుబడులు పెడితే 40 శాతం రాబడి వస్తుందని బెంగళూరు నగరంలో మంచి పేరు, పరిచయాలు ఉన్న ఓ వ్యక్తి వీరిని మోసగించినట్టు తెలుస్తోంది. ఇంగ్లిష్ మీడియాలో ఇందుకు సంబంధించిన వార్తలు వస్తున్నాయి.

కళలు, సినిమా, రాజకీయం, వాణిజ్యం, క్రీడలు ఇతర రంగాలకు చెందిన దాదాపు 800 మందిని విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ మోసగించిందని బెంగూళూరు పోలీసులు చెబుతున్నారు. ఆ సంస్థ యజమాని రాఘవేంద్ర శ్రీనాథ్, ఏజెంట్లు సూత్రమ్ సురేశ్, నరసింహ మూర్తి, కేసీ నాగరాజు, ప్రహ్లాద్‌ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

ఏజెంట్ సురేశ్ బెంగళూరులో ఎక్కువ పరిచయాలున్న క్రీడా విలేకరి. దీంతో ఆయన చాలా మంది క్రీడాకారులను ప్రభావితం చేసి మోసపూరిత పథకంలో పెట్టుబడులు పెట్టించారు. అరెస్టైన వ్యక్తులను పోలీసులు 14 రోజుల పాటు కస్టడీకి పంపించారు. ఈ బృందం రూ.300 కోట్లకు పైగా డబ్బులు వసూలు చేసినట్టు పోలీసులు వెల్లడించారు. సంస్థ పత్రాలన్నిటినీ పరిశీలిస్తున్నట్టు పేర్కొన్నారు. బాలాజీ అగరబత్తీ కంపెనీ యజమాని పీఆర్ బాలాజీ విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ఫిర్యాదు ఇవ్వడంతో ఈ మోసపూరిత పథకం బయటకు వచ్చింది.

## షమీ మెడకు మరో ఉచ్చు!

న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ మహ్మద్ షమీ వివాహేతర సంబంధాల కేసు వివాదం అతడి కెరీర్‌ను భారీ దెబ్బ కొట్టేలా కనిపిస్తోంది. వివాహేతర సంబంధాల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న షమీ మెడకు అవినీతి, ఫిక్సింగ్ కేసు చుట్టుకుంది. భార్య చేసిన ఆరోపణల్ని విశ్వసించిన బీసీసీఐ బౌలర్ షమీపై విచారణ చేపట్టాలని అవినీతి నిరోధక-భద్రతా విభాగాన్ని (యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ వింగ్) ఆదేశించింది.



తన భర్త షమీ దుబాయ్ వెళ్లి అక్కడ కొందరు వ్యక్తుల నుంచి డబ్బు తీసుకున్నాడని హసీన్ జహాన్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌కు చెందిన మహ్మద్ బాయ్ అనే మధ్యవర్తి ద్వారా పాకిస్తాన్ మహిళ నుంచి తన భర్త షమీ డబ్బులు తీసుకున్నాడని హసీన్ జహాన్ తన ఫిర్యాదులో పేర్కొంది. ఏసీఎస్‌యూ అధిపతి నీరజ్ కపూర్ షమీ కేసును విచారించి వారం రోజుల్లోగా నివేదిక అందించనున్నట్లు సమాచారం.

మరోవైపు భార్యతో క్రికెటర్ షమీ ఫోన్ సంభాషణను సీఓఏ విన్న తర్వాత షమీపై విచారణ చేపట్టాలని నిర్ణయించుకుంది. పాక్ మహిళ నుంచి మ్యాచ్ ఫిక్సింగ్ కోసం డబ్బులు తీసుకున్నాడా.. లేక ఇతర్రతా విషయాల కోసమా అన్నది తమ విచారణలో తేలనుందని బీసీసీఐ యాంటీ కరప్షన్ అండ్ సెక్యూరిటీ వింగ్ పేర్కొంది.

## యువీ, గేల్.. చెరో రెండు విజయాలు చాలు!
### పెట్టిన పెట్టుబడికి న్యాయం చేస్తారు
### పంజాబ్ జట్టు కోచ్ సెహ్వాగ్ ఆశాభావం



న్యూఢిల్లీ: మరికొద్ది రోజుల్లో ప్రారంభమయ్యే ఐపీఎల్ 11వ సీజన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ జట్టు ఆటగాళ్లు యువరాజ్ సింగ్, క్రిస్ గేల్ ఇద్దరూ కలిసి చెరో రెండు మ్యాచ్‌లను గెలిపించినా ఫ్రాంచైజీకి న్యాయం చేసినట్టేనని ఆ జట్టు కోచ్ వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. ఈ ఇద్దరు ఆటగాళ్లను రెండోసారి జరిగిన వేలంలోనూ ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయని విషయం తెలిసిందే. వీరిని రూ.2 కోట్ల చొప్పున పంజాబ్ జట్టు కొనుగోలు చేసింది.

**ఓపెనర్‌గా యువీ సేవలు..**

దిగ్గజ ఆటగాళ్లు గేల్, యువరాజ్‌లు తక్కువ ధరకే మా సొంతం అయ్యారు. వారిద్దరూ మ్యాచ్ విన్నర్లు. వాళ్లు చెరో రెండు మ్యాచ్‌లు గెలిపించినా.. వాళ్లపై పెట్టిన పెట్టుబడికి న్యాయం చేసినట్టేనని సెహ్వాగ్ అన్నారు. ఓపెనర్‌గా యువీని కొన్ని మ్యాచుల్లో వినియోగించుకుంటాం. అయితే ఆరోన్ ఫించ్, మయాంక్ అగర్వాల్ తరహాలో క్రిస్ గేల్ ప్రారంభంలో ఆటలోకి దిగి ఎక్కువ సేపు వికెట్ కాపాడు కోలేడు.

ఆరోన్ ఫించ్ వివాహం సందర్భంగా తొలి మ్యాచ్‌లో అందుబాటులో ఉండడం లేదు.

అతని స్థానంలో గేల్ ఓపెనింగ్‌కు పంపిస్తాం. అయితే, అతను నిలకడ ఆడాల్సిన అవసరముంది అని సెహ్వాగ్ పేర్కొన్నారు.

## ఉగ్రవాదంపై విరుచుకుపడేందుకు పోలీసుల సరికొత్త వ్యూహం

న్యూఢిల్లీ : జమ్మూ-కశ్మీరులో ఉగ్రవాద కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు ఆ రాష్ట్ర పోలీసులు సిద్ధమవుతున్నారు. రాత్రివేళల్లో నిఘా కార్యకలాపాలకు ఉపయోగపడే పరికరాల్లో మానవ రహిత సూక్ష్మ గగనతల వాహనాలను సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. భద్రత, నిఘా, ఉగ్రవాద కార్యకలాపాలను గుర్తించడం వంటివాటి కోసం వీటిని ఉపయోగిస్తారు.

రాష్ట్రంలో భద్రతాపరమైన కార్యకలాపాల నిర్వహణకు ఇప్పటికే 8 డ్రోన్లకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ముబసిర్ లతిఫి చెప్పారు. ఒరిజినల్ మాన్యుఫ్యాక్చరర్స్ లేదా ఆథరైజ్డ్ డీలర్స్ నుంచి



టెండర్లను ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను, పోలీసు దళాలను పటిష్టపరచాలని డీజీపీ ఎస్ పీ వైద్ గట్టిగా నిర్ణయించుకున్నారని, దీనిలో భాగంగానే ఈ యూఏవీలను సేకరిస్తున్నామని చెప్పారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com